## నిరసనకు దిగితే వ్యాపారాలు ఎలా చేసుకోవాలి..

**ఢిల్లీ,ట్రైనెట్ న్యూస్:** రాహుల్‌గాంధీకి ట్రేడర్స్ మరో లేఖ..! సీఈసీ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో కాంగ్రెస్ పార్టీ ఒకి పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. అయితే దీపావళి పండగ వేళ ఈ ఆందోళన కారణంగా తాము నష్టపోతామని, ర్యాలీని వాయిదా వేసుకోవాలని దేశ రాజధానిలోని వ్యాపార సంఘాలు అభ్యర్థించాయి.దీనిపై కాంగ్రెస్ పార్టీగానీ, రాహుల్‌గాంధీగానీ సానుకూలంగా స్పందించకపోవడంతో 'ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ మరోసారి లేఖ రాసింది. పది లక్షల మంది నిరసనకారులు ఢిల్లీకి వస్తే వ్యాపారం ఎలా చేసుకోవాలని ప్రశ్నించింది. దీపావళి పండగ సీజన్‌లో ర్యాలీ నిర్వహించడంవల్ల రామ్‌లీలా మైదానం పరిసరాల్లో దాదాపు రూ.10 వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం పడవచ్చని పేర్కొన్నది. ర్యాలీని నవంబర్ 10కి వాయిదా వేయాలని విజ్ఞప్తి చేసింది.


# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి:01 | సంచిక:82 | ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు | బుధవారం, అక్టోబర్ 28, 2026 | పేజీలు:12 | వెల:10రూ/-


## హోప్ ఐలాండ్‌ను పూర్తిగా ఖాళీ

- హోంమంత్రి అనిత కీలక సూచనలు
- తీరం వైపు దూసుకొస్తున్న ఆర్నబ్ తీవ్ర తుపాన్
- రేపు ఉదయం బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
- తీర జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించిన ప్రభుత్వం




**అమరావతి, ట్రైనెట్ న్యూస్:**బంగాళాఖాతంలో ఏర్పడిన 'ఆర్నబ్' తుపాను అతి తీవ్ర తుపాన్‌గా మారింది. ఇది రేపు ఉదయం బాపట్ల-విశాఖపట్నం మధ్య యానాం సమీపంలో తీరం దాటనుందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొత్తం యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు భారీ స్థాయిలో సహాయక చర్యలను ప్రారంభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిన్న ఉన్నతాధికారులు, కలెక్టర్లతో సమీక్ష నిర్వహించి, జీరో క్యాజువాలిటీ లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు.తీర ప్రాంత జిల్లాల్లో 15 ఎన్డీఆర్ఎఫ్, 8 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను మోహరించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న సుమారు 89,000 మందిని గుర్తించి, 101 పునరావాస కేంద్రాలకు తరలించే ప్రక్రియను వేగవంతం చేశారు. ముందుజాగ్రత్త చర్యగా కాకినాడ తీరంలోని హోప్ ఐలాండ్‌ను పూర్తిగా ఖాళీ చేయించారు.ప్రభుత్వం పూర్తిగా అప్రమత్తంగా ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడటమే తమ ప్రథమ ప్రాధాన్యత అని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఆమె భరోసా ఇచ్చారు.

# గొడ్డలి పార్టీ హింసను వీడి జనస్రవంతిలో కలవాలి

- బెంగళూరు నుంచి వచ్చి హిట్ అండ్ రన్ తరహాలో వ్యవహరిస్తున్నారని విమర్శ
- కూటమి అభ్యర్థులకే సహకరించాలని పార్టీ శ్రేణులకు చంద్రబాబు విజ్ఞప్తి
- ప్రజలు మరోసారి ఆశీర్వదించి అభివృద్ధికి సహకరించాలని కోరిన సీఎం
- పులివెందుల మున్సిపాలిటీలో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ
- మొత్తం 40 వార్డులకు గాను 20 ఏకగ్రీవంగా



గెలుచుకున్న టీడీపీ కూటమి!

- నియోజకవర్గంలోని 65 ఎంపీటీసీ స్థానాలకు గాను 64 స్థానాల్లో కూటమి ఏకగ్రీవం!


మిగతాది 2లో




## రష్యా చమురుకు బ్రేక్!

- రవాణా, బీమా ఖర్చులు పెరగడంతో
- కొనుగోళ్లు తగ్గించాలని బీపీసీఎల్ నిర్ణయం
- సౌదీ, అబుదాబి నుంచి దిగుమతికి ఆసక్తి

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్:**రవాణా ఖర్చులు విపరీతంగా పెరగడంతోపాటు డిస్కౌంట్లు కూడా భారీగా తగ్గడంతో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గించుకోవాలని ప్రభుత్వ రంగ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) నిర్ణయించింది. నవంబరులో ఆ దేశం నుంచి చమురు కొనుగోళ్లు గణనీయంగా తగ్గించాలని భావించినట్టు బీపీసీఎల్ ఫైనాన్స్ హెడ్ రామకృష్ణ గుప్తా సోమవారం వెల్లడించారు. రష్యా


మిగతాది 2లో


## బీజేపీ ఏం చేసిందో ప్రశ్న అడగాల్సిన సమయం వచ్చింది..



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్**మీ నిర్మల్ తాలూకాలో బీజేపీ ఎమ్మెల్యే ఉన్నరు, బీజేపీ ఎంపీ ఉన్నరు.. నిర్మల్‌కు బీజేపీ ఏం చేసిందో ప్రశ్న అడగాల్సిన సమయం వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్మల్ జిల్లాకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు కేటీఆర్ సమక్షంలో భారీగా చేరారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఢిల్లీలో బీజేపీ ప్రజలను విభజించడంలో బిజీగా ఉంటే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రజలను దోచుకోవడంలో బిజీగా ఉన్నారు.. తప్పు వాళ్లు చేసిందేమీ కాదు..


మిగతాది 2లో


## పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యం

- తెలంగాణకు పెట్టుబడులపై ఫోకస్..
- గ్లోబల్ సమ్మిట్‌తో రేవంత్ సర్కార్ భారీ ప్లాన్!

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్:**రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ -2026ను తెలంగాణ ప్రభుత్వం నిర్వహించనుంది. ఇందులో భాగంగానే ఈ సమ్మిట్‌కు భారీ ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం చేస్తోంది. ఈ సమ్మిట్‌కు 550కు పైగా దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలకు ఆహ్వానాలను అందించారు. అక్టోబరు 29వ తేదీన న్యూఢిల్లీలో గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ జరగనుంది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు. వివిధ దేశాల రాయబారులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలకు తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానించనున్నారు.తెలంగాణకు భారీ పెట్టుబడులే లక్ష్యంగా గ్లోబల్ సమ్మిట్‌ను రేవంత్ సర్కార్ నిర్వహించనుంది. ప్రధాన సమ్మిట్‌కు 1,500కు పైగా కంపెనీలు, సంస్థల ప్రతినిధులకు ఆహ్వానాలను



అందించనున్నారు. ఇప్పటికే చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ రోడ్‌షోలు నిర్వహించిన విషయం తెలిసిందే. రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రక్షా ఎక్స్‌పోలో పాల్గొనేందుకు వందకు పైగా కంపెనీలు, సంస్థలకు ఆహ్వానాలను అందించనున్నారు. ఫ్యూచర్ సిటీలో 25 సెక్టార్లుగా ప్రధాన


మిగతాది 2లో


## తెలంగాణలో 1.90 లక్షల మంది మహిళలకు కుట్టు మిషన్లు

- పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్,ట్రైనెట్ న్యూస్:** బీసీ సంక్షేమ శాఖ, విద్యా నిధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఈరోజు సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. 38 బీసీ ఆత్మగౌరవ భవనాల జీవోల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. డిసెంబర్ 9న మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీకి కార్యాచరణ చేపట్టాలని, కుట్టు మిషన్ల పథకానికి 4.80 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. 1.90 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూర్చేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు.తెలంగాణలోని 327 గురుకులాల్లో 26 పాఠశాలలకే సొంత భవనాలు ఉన్నాయని, మిగిలిన 301 గురుకులాలకు సొంత భవనాల నిర్మాణంపై దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. గురుకులాలకు అవసరమైన స్థలాల సేకరణను త్వరగా పూర్తి



చేయాలని ఆదేశించారు. బీసీ స్టడీ సర్కిళ్లలో సంస్కరణలు, ఉద్యోగాలే లక్ష్యంగా నాణ్యమైన శిక్షణ అందించాలన్నారు. బీసీలకు స్వయం ఉపాధి అవకాశాలు పెంచేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. బీసీ వితంతువులు, ఒంటరి మహిళలకు నైపుణ్య శిక్షణపై ప్రత్యేక కమిటీని నియమించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఆధునిక ధోబీఘాట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ఆదేశాలు జారీ చేశారు.



## అన్యాయం చేసిన ఏ అధికారినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు

**ఈ రెండేళ్లు ఓపిక పడితే వచ్చేది జగన్ 2.0 అన్న జగన్**

- అన్యాయం చేసిన అధికారులను వడ్డీతో సహా చెల్లించేలా చేస్తామని హెచ్చరిక

**అమరావతి, ట్రైనెట్ న్యూస్:**"ఈ రెండేళ్లు ఓపిక పట్టండి.. వచ్చేది జగన్ 2.0" అని పార్టీ శ్రేణులకు వైసీపీ అధినేత జగన్ పిలుపుని చ్చారు. పులివెందులలోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన ఆయన... అధికార కూటమిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పులివెందుల నుంచి మొదలయ్యే ధ్వని రాష్ట్రమంతా వినిపించాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని తుడిచిపెట్టేస్తామని ధీమా వ్యక్తం చేశారు."మా టైమ్ వచ్చినప్పుడు, చట్టాన్ని అతిక్రమించి అన్యాయం చేసిన ఏ అధికారినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. వారు సర్వీసులో ఉన్నా, ఒకవేళ రిటైర్ అయిపోయినా సరే.. ఎక్కడున్నా తీసుకొచ్చి చట్టం ముందు నిలబెట్టి చర్యలు తీసుకుంటాం. వడ్డీతో సహా చెల్లించేలా చేస్తాం" అని తీవ్రంగా హెచ్చరించారు.

## పునరావాస కేంద్రాలకు తరలించాలి

- యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన పవన్
- ప్రజల ప్రాణాలను కాపాడటమే తొలి ప్రాధాన్యమన్న పవన్ కల్యాణ్

**అమరావతి, ట్రైనెట్ న్యూస్:**బంగాళాఖాతంలో ఏర్పడిన 'ఆర్నబ్' తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తున్న నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం అప్రమత్త మైంది. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) శాఖల అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తుపాను ముప్పును ఎదుర్కొనేందుకు తీర ప్రాంత జిల్లాల యంత్రాంగం పూర్తి సన్నద్ధతతో ఉండాలని ఆయన ఆదేశించారు.ఈ సందర్భంగా



పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. తీర ప్రాంతాలు, లోతట్టు గ్రామాలు, మత్స్యకార ఆవాసాల్లోని ప్రజలను తక్షణమే గుర్తించి, సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులకు సూచించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, పారిశుద్ధ్యం, జనరేటర్లతో పాటు వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గర్భిణులు, చిన్నారులు, వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.తుపాను ప్రభావం పూర్తిగా తొలగిపోయే వరకు తన పరిధిలోని శాఖల సిబ్బందికి సెలవులు రద్దు చేస్తున్నట్లు పవన్ కల్యాణ్

# రష్యా చమురుకు బ్రేక్!

మొదటి పేజీ తరువాయి

చమురుతో పోలిస్తే పశ్చిమాసియా దేశాల నుంచి ప్రస్తుతం ముడిచమురు మరింత చౌకగా, లాభదాయకంగా ఉండడం కూడా దీనికి ప్రధాన కారణని తెలిపారు. గత జూలై-సెప్టెంబరు త్రైమాసికంలో బీపీసీఎల్ తన మొత్తం అవసరాల్లో 37% ముడి చమురును రష్యా నుంచే దిగుమతి చేసుకుంది. అయితే.. అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతల వల్ల రవాణా, బీమా ఖర్చులు భారీగా పెరిగాయి. దీనివల్ల రష్యా నుంచి చమురు తెచ్చుకోవడం ఆర్థికంగా భారంగా మారింది. అక్టోబరు డెలివరీలకు రష్యా చమురు ప్రీమియం బ్యారెల్‌కు 12-13 డాలర్లు ఉండగా.. డిసెంబరు నాటికి అది 1-2 డాలర్లకు తగ్గే అవకాశం ఉందని రామకృష్ణ గుప్తా తెలిపారు. కాబట్టి డిసెంబరులో కార్గో, రవాణా ఖర్చులు, బీమా, డిస్కౌంట్లను బట్టి రష్యా నుంచి మళ్లీ చమురు కొనుగోళ్లను పెంచే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ త్రైమాసికంలో సౌదీ అరేబియా, అబుదాబి వంటి పశ్చిమాసియా దేశాల నుంచి దిగుమతులు పెంచుకోవాలని బీపీసీఎల్ భావించినట్లు గుప్తా తెలిపారు. అక్టోబరు, నవంబరు నెలల్లో ఈ ప్రాంతం నుంచి అధిక మొత్తంలో చమురు కొనుగోలు చేయాలని అంచనా వేసినట్లు చెప్పారు.

## అన్యాయం చేసిన ఏ అధికారినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు

మొదటి పేజీ తరువాయి

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో అధికార కూటమి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. "ఎన్నికల్లో 50 శాతం సీట్లలో పోటీ చేస్తున్నది మా అక్కచెల్లెమ్మలే. వారి నామినేషన్లను నడిరోడ్డుపై అడ్డుకుంటున్నారు. అక్కచెల్లెమ్మల చీరలు చించి దాడులు చేశారు. ఇలా చేయడానికి మీకు సిగ్గుందా? వైసీపీ హయాంలోనే మహిళలకు నిజమైన న్యాయం జరిగింది. ఇప్పుడు చంద్రబాబు చేస్తున్న పనులకు ఆయనే సిగ్గుతో తలదించుకోవాలి" అని మండిపడ్డారు. నామినేషన్ల ప్రక్రియలో అడుగడుగునా అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు. "కూటమి నేతలే 17 మున్సిపాలిటీలు ఏకగ్రీవమని ప్రకటించుకున్నారు. నా సొంత నియోజకవర్గమైన పులివెందులలోనే కేవలం 20 వార్డుల్లో నామినేషన్లు వేయగలిగాం. 7 జడ్పీటీసీ స్థానాలకు గాను 4 చోట్ల మాత్రమే పోటీ జరుగుతోంది. స్క్రూటినీ పేరిట 2 మండలాల్లో మా నామినేషన్లను అన్యాయంగా తిరస్కరించారు" అని దుయ్యబట్టారు.కార్యకర్తలంతా ధైర్యంగా ఉండాలని, వారికి తాను అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ రోజున తాను స్వయంగా పులివెందులలోనే ఉంటానని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపు ఖాయమని అన్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని... మీ అన్న మీకు తోడుగా ఉంటాడని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

## పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

సమ్మిట్ వేదికను విభజించారు.ప్లీనరీలు, సెమినార్లు, చర్చలు, ఒప్పందాల కార్యక్రమాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అంతర్జాతీయ ప్రతినిధుల కోసం రవాణా, వసతి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ప్రతినిధికి సమన్వయ బాధ్యతల కోసం సీనియర్ అధికారిని నోడల్ అధికారిగా నియమించనున్నారు. ఈ ఏర్పాట్లన్నీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వ సీఎస్ సంజయ్ జాజు ఆదేశాలు జారీ చేశారు. యువతకు విస్తృత ఉపాధి అవకాశాల కల్పనే ఈ సమ్మిట్ ప్రధాన లక్ష్యమని సీఎస్ సంజయ్ జాజు పేర్కొన్నారు.

## బీజేపీ ఏం చేసిందో ప్రశ్న అడగాల్సిన సమయం వచ్చింది..

మొదటి పేజీ తరువాయి

ఏమొచ్చింది నిర్మల్‌కు.. అదే కేసీఆర్ ఉన్నప్పుడు నిర్మల్‌కు ఏమొచ్చిందని అడగొచ్చు.. నిర్మల్‌ను జిల్లా చేసిందెవరు.. కేసీఆర్.. నిర్మల్‌లో మెడికల్ కాలేజీ పెట్టిందెవరు.. నర్సింగ్ కాలేజీ పెట్టిందెవరు.. నిర్మల్‌లో అభివృద్ధికి బాటలు వేసిందెవరు.. కేసీఆర్.. నిర్మల్ పట్టణంలోకానీ, తాలూకాలో కానీ నేను స్వయంగా వచ్చి మీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ప్రారంభించిన. నేనొచ్చి మిషన్ భగీరథ ద్వారా మీ ఇంటింటికి తాగునీళ్లిచ్చే కార్యక్రమం మొదలుపెట్టిన. బ్రహ్మాండంగా చెక్‌డ్యామ్‌లు కట్టుకున్నం.. అయిల్ ఫామ్‌లు పెట్టుకున్నమన్నారు.నిర్మల్‌లో బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, ఎంపీ గోడం నగేష్ గెలిచినా నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన ఇంద్రకరణ్ రెడ్డి అధికారం కోల్పోగానే పార్టీని వీడి పారిపోయాడు. అవకాశవాదులు పార్టీని వీడినా, పోరాట యోధులు బీఆర్ఎస్‌లోనే ఉన్నారన్నారు.ఎప్పుడైనా ప్రతీ పార్టీలో రెండు రకాల వ్యక్తులుంటారు.. ఒకటి అవకాశవాదులుంటారు.. రెండోది పోరాటవాదులుంటారు.. ఆయన అవకాశవాదంతో బయటకు పోయినా మేమున్నం అన్నా భయపడకండని పోరాడుతున్న మీ అందరికీ తలవంచి నమస్కారం చేస్తున్నా.. మంచి రోజులు ముందున్నయి. ఇంకో సంవత్సరమే వీళ్ల కథ.. మూడేళ్లయిపోయింది.. సినిమా ఇంటర్వెల్ కూడా పూర్తయిపోయింది.

# గొడ్డలి పార్టీ హింసను వీడి జనస్రవంతిలో కలవాలి

మొదటి పేజీ తరువాయి

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వైసీపీపై 'గొడ్డలి పార్టీ' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆ పార్టీ హింసాత్మక విధానాలను విడనాడి, జనజీవన స్రవంతిలో కలవాలని హితవు పలికారు. ఈరోజు ఎన్డీఏ నేతలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గొడ్డలి పార్టీ తీరు రాజకీయ పార్టీలా లేదని, రాష్ట్రాన్ని ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పనిచేస్తోందని ధ్వజమెత్తారు.

### తీవ్రవాదుల తరహాలో 'హిట్ అండ్ రన్'

గొడ్డలి పార్టీ నేతల వైఖరి తీవ్రవాదుల తరహాలో ఉందని చంద్రబాబు అభివర్ణించారు. "బెంగళూరు నుంచి వచ్చి రాష్ట్రంలో ఫేక్ ప్రచారం చేసి, మళ్లీ అక్కడికే వెళ్లిపోతున్నారు. ఇది 'హిట్ అండ్ రన్' తరహా వ్యవహారం. గతంలో నక్సలైట్లను జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చాను. ఆనాడు జనశక్తి నుంచి వచ్చిన సీతక్క ఇప్పుడు తెలంగాణలో మంత్రిగా ఉన్నారు. అదేవిధంగా, గొడ్డలి పార్టీ కూడా హింసను వీడి మెయిన్‌స్ట్రీమ్‌లో కలవాలి" అని చంద్రబాబు సూచించారు. క్రిమినలైజేషన్, లిటిగేషన్, ఫేక్ ప్రాపగండానే ఆ పార్టీ సిద్ధాంతమని, తమ కూటమి సిద్ధాంతం సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అని ఆయన స్పష్టం చేశారు.

### ఎన్నికలను అడ్డుకునే కుట్ర

స్థానిక సంస్థల ఎన్నికలు జరగడం గొడ్డలి పార్టీకి ఏమాత్రం ఇష్టం లేదని చంద్రబాబు ఆరోపించారు. ఎన్నికలను ఆపేందుకు ఏకంగా 62 పిటిషన్లు దాఖలు చేశారని తెలిపారు. సర్వర్లు, డీలిమిటేషన్, బీసీ రిజర్వేషన్లపై కోర్టులకు వెళ్లి ప్రక్రియను అడ్డుకోవాలని చూశారని మండిపడ్డారు. "ఈ ఎన్నికలు జరగకపోతే 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోతాయి. స్థానిక సంస్థలు అభివృద్ధి చెందడం వారికి ఇష్టం లేదు. అందుకే నామినేషన్ల ప్రక్రియలో హింసాత్మక ఘటనలు సృష్టించారు" అని విమర్శించారు.

### కూటమి ధర్మంతో ముందుకు

సవాళ్లు, అడ్డంకులు ఎదురైనా కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి కోసం పటిష్ఠంగా ముందుకు సాగుతోందని చంద్రబాబు అన్నారు. తాము పెత్తందార్లం కాదని, ప్రజలకు సేవకులమని, జవాబుదారీతనంతో పనిచేస్తున్నామని చెప్పారు. జనాభా దామాషా ప్రకారం సోషల్ రీ ఇంజనీరింగ్‌ను ఆధారంగా చేసుకుని మూడు పార్టీలు కలిసి సీట్ల కేటాయింపుపై సుదీర్ఘ కసరత్తు చేశాయని వివరించారు. ఎంపీటీసీలకు 46 వేలకు పైగా, జడ్పీటీసీలకు 4,700 పైగా నామినేషన్లు దాఖలు కావడమే ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. బీఫాం ఇచ్చిన కూటమి అధికారిక అభ్యర్థుల గెలుపు కోసమే నేతలు, కార్యకర్తలు పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. 2024లో చారిత్రాత్మక మద్దతు ఇచ్చిన ప్రజలు, తమ రెండున్నరేళ్ల కష్టాన్ని గుర్తించి స్థానిక ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు. ప్రజలు ఇచ్చే ఓటు తమకు నూతన శక్తిని ఇస్తుందని, రాష్ట్రాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని చంద్రబాబు పేర్కొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిని గెలిపించాలి

- ఎన్డీఏ నేతల విజ్ఞప్తి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిని గెలిపించాలని ప్రజలను కోరిన చంద్రబాబు, పవన్
- టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య సీట్ల సర్దుబాటు ప్రక్రియ పూర్తయిందని వెల్లడి
- సీట్లు దక్కని వారికి న్యాయం చేసే బాధ్యత తీసుకుంటామంటూ పవన్ కల్యాణ్ హామీ
- కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నాయని నేతల వెల్లడి
- ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రం ముందుకు సాగుతోందన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్




**అమరావతి,ట్రైనెట్ న్యూస్:**రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సార్వత్రిక ఎన్నికల స్ఫూర్తిని ప్రదర్శించి, కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నేతలు మీడియా సమావేశం నిర్వహించి, స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై మాట్లాడారు. గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, అందుకు ప్రజల సంపూర్ణ మద్దతు అవసరమని వారు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు ఐక్యంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే స్థానిక ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు ప్రక్రియ కొంత క్లిష్టంగా ఉంటుందని, అయినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన సుదీర్ఘ అనుభవంతో ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారని ప్రశంసించారు. రాష్ట్ర శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని అన్ని పార్టీలు సర్దుకుపోయాయని, క్షేత్రస్థాయిలోనూ కార్యకర్తలు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. సీట్లు దక్కని వారికి భవిష్యత్తులో తప్పకుండా న్యాయం చేసే బాధ్యతను కూటమి తీసుకుంటుందని పవన్ భరోసా ఇచ్చారు.కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో, పారిశ్రామికవేత్తల్లో ఉన్న నమ్మకం వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయని పవన్ అన్నారు. దేశంలోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే రావడం చంద్రబాబు సమర్థ నాయకత్వానికి నిదర్శనమని కొనియాడారు. రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. 'పల్లె పండుగ 1.0, 2.0', 'అడవితల్లి బాట' వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. జల్ జీవన్ మిషన్ కింద రూ.30 వేల కోట్లతో 3.20 కోట్ల మందికి సురక్షిత తాగునీరు అందించే బృహత్తర కార్యక్రమం చేపట్టామన్నారు. గత ప్రభుత్వ హయాంలో వేధింపులకు గురైన ఉద్యోగులకు రూ.30 వేల కోట్ల బకాయిలు చెల్లించామని, గంజాయిపై ఉక్కుపాదం మోపామని స్పష్టం చేశారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. కూటమి ఆధ్వర్యంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కొనసాగుతున్నాయని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నామని, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని విధాలా అండగా నిలుస్తోందని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో చూపిన ఆదరణనే స్థానిక ఎన్నికల్లోనూ చూపించి, కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.

# సొంత కుటుంబం పట్లనే అలా ఉంటే, రాష్ట్ర మహిళలను ఏం చూసుకుంటారు

- మేనకోడలి పెళ్లికి మేనమామగా దీవించాల్సింది పోయి అడ్డుకుంటున్నారని ఆరోపణ
- సొంత కుటుంబం పట్లనే అలా ఉంటే, రాష్ట్ర మహిళలను ఏం చూసుకుంటారని వ్యాఖ్య
- మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీలోకి పలువురు వైసీపీ, సీపీఎం నేతల చేరిక



**అమరావతి, ట్రైనెట్ న్యూస్:**వైసీపీ అధినేత జగన్ పై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సొంత కుటుంబ సభ్యుల విషయంలోనే జగన్ వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందని ట్వీట్ చేశారు. ప్రతి కుటుంబంలో మేనకోడలి పెళ్లికి మేనమామ అన్నీతానై ఆశీర్వదించి పంపుతాడని, కానీ జగన్ మాత్రం అందుకు భిన్నంగా ప్రవర్తిస్తున్నారని లోకేశ్ తెలిపారు.దివంగత వైఎస్సార్ సొంత ఇంట్లో ఆయన మనవరాలి పెళ్లి జరగకుండా జగన్ అడ్డుకుంటున్నారని లోకేశ్ ఆరోపించారు. "సొంత చెల్లెలి విషయంలోనే ఇలా ప్రవర్తిస్తే, గత ఐదేళ్లలో రాష్ట్రంలోని మహిళలను, సోదరీమణులను ఆయన ఎలా చూసుకున్నారో ప్రజలకు ఇప్పటికే అర్థమైంది" అని లోకేశ్ వ్యాఖ్యానించారు. సొంత కుటుంబానికే న్యాయం చేయలేని వ్యక్తి, రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తారని ఆయన ప్రశ్నించారు.

### లోకేశ్ సమక్షంలో చేరికలు

మరోవైపు, ఉండవల్లిలోని తన నివాసంలో పలువురు నేతలను నారా లోకేశ్ టీడీపీలోకి ఆహ్వానించారు. మంగళగిరి నియోజకవర్గానికి చెందిన సీపీఎం నేతలు శివన్నారాయణ (కొలనుకొండ), ముసలి జ్యోతిబసు (ఆత్మకూరు)లతో పాటు వైసీపీ నేతలు నూతలపాటి చెన్నకేశవరావు (పేరుకలపూడి), ఉయ్యూరు వెంకటేశ్వరరావు (ఈమని), ముద్రబోయిన శ్రీను, షేక్ యూసబ్ (చిలువూరు) టీడీపీలో చేరారు. వీరందరికీ లోకేశ్ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలికారు. వీరితో పాటు పెద్ద సంఖ్యలో వైసీపీ, సీపీఎం కార్యకర్తలు కూడా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

# జగన్ ఉడత బెదిరింపులకు భయపడేవారు ఇక్కడ ఎవరూ లేరు

- మంత్రి అచ్చెన్నాయుడు
- జగన్ వ్యాఖ్యలపై మంత్రి అచ్చెన్నాయుడు ఫైర్
- 'మా టైం వస్తుంది' అనడానికి ఇది జమీందారీ రాజ్యం కాదని చురక

**అమరావతి, ట్రైనెట్ న్యూస్:**వైసీపీ అధినేత జగన్ పై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగన్ ఉడత బెదిరింపులకు, హెచ్చరికలకు భయపడేవారెవరూ ఇక్కడ లేరని, ఇది ప్రజాస్వామ్యం తప్ప జమీందారీ రాజ్యం కాదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు అచ్చెన్నాయుడు సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేశారు."వడ్డీతో సహా



చెల్లిస్తాం", "ఇప్పుడు మీ టైం.. తర్వాత మా టైం" వంటి హెచ్చరికలను మానుకోవాలని అచ్చెన్నాయుడు హితవు పలికారు. ప్రజాస్వామ్యంలో తుది తీర్పు ఇచ్చేది ప్రజలేనని గుర్తుంచుకోవాలన్నారు. గత ఐదేళ్ల దారుణ పాలనపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక, అధికారులను, పోలీసులను బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి అభ్యర్థి పూర్తి స్వేచ్ఛతో నామినేషన్ వేస్తున్నారని, తమ పాలనకు, గత పాలనకు ఉన్న తేడా ఇదేనని పేర్కొన్నారు.గతంలో జరిగిన హింసాత్మక ఘటనలను ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. సొంత పార్టీ ఎంపీటీసీ అభ్యర్థిపై వైసీపీ నేతలు దాడి చేసినా, పుంగనూరులో మిథున్‌రెడ్డి హింస సృష్టించినా జగన్‌కు కనపడలేదా అని ప్రశ్నించారు. మాచర్లలో బోండా ఉమ, బుద్ధా వెంకన్నలపై జరిగిన దాడులను, ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్‌ను తొలగించేందుకు తెచ్చిన నల్ల ఆర్డినెన్స్‌ను ప్రజలు మర్చిపోలేదన్నారు.

## మీరు ముఖ్యమంత్రి అవుతారు సార్..

- కేటీఆర్‌తో బాలుడు
- బాలుడు అఖిల్ కోరికను నెరవేర్చిన మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

**ఖమ్మం, ట్రైనెట్ న్యూస్:** తనతో ఫొటో దిగాలన్న బాలుడి కోరికను కేటీఆర్ నెరవేర్చి బాలుడిలో ఎనలేని సంతోషాన్ని నింపారు. ఎన్నో రోజుల నుండి పరోక్షంగా కేటీఆర్‌ను టీవీలో చూస్తున్న బాలుడు స్వయంగా కేటీఆర్‌తో ఫొటో దిగాలనే కోరికను పదేపదే వెలిబుచ్చుతుండగా ఆ కోరికను పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి నెరవేర్చారు. వివరాల్లోకి వెళితే.. ఖమ్మం రూరల్ మండలం కామంచికల్ గ్రామానికి చెందిన దరిపెల్లి అఖిల్ అనే బాలుడు గత కొద్ది రోజుల నుండి కేటీఆర్ ను చూడాలనే కొరికను బలంగా కలిగి ఉన్నాడు. కుటుంబ సభ్యులకు, ఇంటికి వచ్చిన వాళ్లందరికీ పదేపదే విషయం చెప్పి తన కోరికను వెలిబుచ్చుతుండేవాడు. అఖిల్ మనసులో ఉన్న కోరికను ఎలాగైనా తీర్చాలనే ఉద్దేశంతో కుటుంబ సభ్యులు ఈ నెల 18న ఖమ్మం జిల్లా కేంద్రం తెలంగాణ భవన్‌లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డిని కలిసి బాలుడి కోరికను వివరించారు.దీంతో స్పందించిన కందాల మంగళవారం అఖిల్ తో పాటు కుటుంబ సభ్యులను హైదరాబాద్‌కు రప్పించారు. వారిని వెంట తీసుకుని తెలంగాణ భవన్‌కు వెళ్లారు. అక్కడ కేటీఆర్ ను చూసిన అఖిల్ సంతోషానికి అవధులు లేకుండా పోయాయి.

# బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరంలో తెలంగాణ గొంతు బలంగా వినిపిస్తాం

## తెలంగాణ ప్రగతి, రాష్ట్ర కీలక అంశాలను అంతర్జాతీయ వేదికపై వివరిస్తాం: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని మరింత పెంచేందుకు కృషి చేస్తామని తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. ఢిల్లీలోని సంవిధాన్ సదన్ (పాత పార్లమెంట్ భవనం)లో అక్టోబర్ 26, 27 తేదీల్లో నిర్వహిస్తున్న 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రగతి, రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలను వివరిస్తామని స్పీకర్ తెలిపారు. బ్రిక్స్ సమావేశాల వేదికపై తెలంగాణ గొంతును బలంగా వినిపిస్తామని పేర్కొన్నారు.

**శంషాబాద్ నుంచి ఢిల్లీకి పయనం**
బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం సమావేశాల్లో పాల్గొనేందుకు గడ్డం ప్రసాద్ కుమార్ సోమవారం ఉదయం శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధి, రాష్ట్ర ప్రాధాన్యతలను అంతర్జాతీయ స్థాయిలో ప్రస్తావించేందుకు ఈ సమావేశాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

**పలువురు ప్రముఖుల భాగస్వామ్యం**



12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం సమావేశాల్లో తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు కూడా పాల్గొన్నారు. వివిధ దేశాల పార్లమెంటరీ ప్రతినిధులు పాల్గొనే ఈ వేదికపై తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అంశాలను ప్రస్తావించడంతోపాటు, రాష్ట్ర ప్రతిష్ఠను మరింత పెంచేందుకు కృషి చేస్తామని స్పీకర్ తెలిపారు.
గడ్డం ప్రసాద్ కుమార్ పర్యటన విజయవంతం కావాలని పలువురు ఆకాంక్షించారు.

# యాసంగిలో వరి సాగు వద్దు.. రైతులకు మంత్రి తుమ్మల సూచన

## ఎల్‌నినో ప్రభావంతో సాగునీటి కొరతకు అవకాశం.. తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

**ఖమ్మం, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
ఉమ్మడి ఖమ్మం జిల్లాలో యాసంగి పంటల సాగు, సాగునీటి లభ్యత, తాగునీటి సరఫరా, ఆర్నాభ్ తుఫాన్ ప్రభావం తదితర అంశాలపై రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో సాగునీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యాసంగిలో వరి సాగుకు దూరంగా ఉండాలని రైతులకు పిలుపునిచ్చారు.

**సాగునీటి లభ్యతపై ముందస్తు ప్రణాళిక**
ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యతపై ప్రతికూల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులకు ఇరిగేషన్ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. సాగునీటి కొరత కారణంగా రైతులు పెట్టుబడులు పెట్టి నష్టపోయే పరిస్థితి రాకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీతారామ ప్రాజెక్టు కాలువలు, సాగర్ ఎడమ కాలువలో షట్టర్లు మూసి నీటిని నిల్వ ఉంచేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు.



**తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు**
వేసవిలోతాగునీటిసమస్యలుతలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు నిరంతర నీటి సరఫరా అందించేందుకు కిన్నెరసాని ప్రాజెక్టునుప్రత్యామ్నాయవనరుగావినియోగించుకునేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి ఇబ్బందులు, విద్యుత్ కోతలు లేకుండా ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**తుఫాన్ నేపథ్యంలో రైతులు అప్రమత్తం**
ఆర్నాభ్ తుఫాన్ నేపథ్యంలో చేతికొచ్చిన పంటలకు నష్టం వాటిల్లకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటల రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పంటల ఉత్పత్తులు తగ్గినప్పటికీ వివిధ రకాల పంటలకు మంచి ధరలు లభిస్తున్నాయని పేర్కొన్నారు.

**కొనుగోళ్లలో ఇబ్బందులు రాకూడదు**
రైతులు పండించిన పంటలను విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా మార్కెటింగ్ శాఖ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు నష్టం కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. సాగునీటి కొరత, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా, పంటల కొనుగోళ్లు వంటి అంశాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి స్పష్టం చేశారు. పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికలతో ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.

# కేంద్ర హోంమంత్రి తో గవర్నర్ భేటీ

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కేంద్ర హోంమంత్రితో గవర్నర్ భేటీ అయ్యారు.



# కాళేశ్వరం పేరు వింటే హరీశ్‌రావుకు ఎక్కడలేని కోపం: ఎంపీ చామల

## మేడిగడ్డ నుంచి ఏపీకి 20 వేల క్యూసెక్కుల నీళ్లు వెళ్తున్నాయనడం బీఆర్ఎస్ దుష్ప్రచారం

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజీ గురించి మాట్లాడితే మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఎక్కడలేని కోపం వస్తోందని భువనగిరి లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాల వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితి దెబ్బతిన్నదని ఆరోపించారు.
మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వద్ద నీటిమట్టాల గురించి తాను మాట్లాడానని చామల పేర్కొన్నారు. అయితే, మేడిగడ్డ నుంచి 20 వేల క్యూసెక్కుల నీరు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్తోందంటూ బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్న విషయం తెలంగాణ ప్రజలకు, బీఆర్ఎస్ నేతలకు తెలియదా అని ప్రశ్నించారు.



**బీఆర్ఎస్ హయాంలోనే బ్యారేజీ దెబ్బతింది**
బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని చామల ఆరోపించారు. అప్పట్లో ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టును సరిగా నిర్వహించలేకపోయారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరు ప్రస్తావించినప్పుడల్లా హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని వ్యాఖ్యానించారు.
బీఆర్ఎస్ పాలనలో తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన పనుల కారణంగానే కాళేశ్వరం ప్రాజెక్టుకు ఈ పరిస్థితి వచ్చిందని ఆయన ఆరోపించారు. గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవడంలో గత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

**దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల్లో పంపులు నడుస్తున్నాయి**
దేవాదుల, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో పంపులు పనిచేస్తున్నాయని చామల తెలిపారు. మేడిగడ్డ వద్ద గతంలోనూ నీటిని ఎత్తిపోసేందుకు అవకాశం లేదని, ప్రస్తుతం కూడా పరిస్థితి అలాగే ఉందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై బీఆర్ఎస్ నేతలు వాస్తవాలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలకు దిగుతున్నారని ఆయన ఆరోపించారు. గోదావరి జలాల వినియోగం, బ్యారేజీల పరిస్థితిపై ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన అవసరం ఉందని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

# యువత మత్తుకు దూరంగా ఉండి మైదానాల వైపు రావాలి:

## ఎంపీ ఎం. అనిల్ కుమార్ యాదవ్



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణ క్రీడా శాఖ చేపట్టిన 'ఖేలో తెలంగాణ' కార్యక్రమంలో యువత, విద్యార్థులు నిరంతరం పాల్గొనాలని రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్ కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రీడలు, వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా క్రీడలు, ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పిస్తున్న తెలంగాణ క్రీడా శాఖను ఆయన అభినందించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, మంత్రి శ్రీధర్ బాబుతో పాటు ముషీరాబాద్ నియోజకవర్గ విద్యార్థులు, యువతకు ఎం. అనిల్ కుమార్ యాదవ్ ఫిట్‌నెస్ ఛాలెంజ్ విసిరారు.
జీఎంసీబీ స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కన్నం మధు
పీఆర్ఓ స్పోర్ట్స్ అథారిటీ సురేష్ కాలేరు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లో విలువ కోల్పోయిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధికి నియోజకవర్గ సమస్యలపై పట్టు ఎంత అవసరమో, వాటిని ప్రభుత్వం ద్వారా సాధించుకునే రాజకీయ పరిపక్వత అంతకంటే ముఖ్యం. కానీ జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి వ్యవహారశైలి చూస్తుంటే, ఆయనకు కనీస రాజకీయ స్పృహ, పాలనా సంస్కారాలు కొరవడ్డాయన్న భావన రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో, కనీసం సొంత గ్రామంలో సైతం కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించుకోలేని అసమర్థత ఆయనది. అలాంటి తెలివితేటల్నే అన్ని విషయాల్లోనూ పాటిస్తున్నారు.

**గతంలో ఎమ్మెల్యేలను కూడగట్టిన నిర్వాకం**
గతంలో తోటి అసంతృప్త ఎమ్మెల్యేలను కూడగట్టి, అధిష్ఠానం వద్ద బేరసారాల కోసం తెరవెనుక వర్గాన్ని నడిపించేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు అభాసుపాలై తీవ్రమైన మైనస్ మార్కులను మూటగట్టుకున్నాయి. ఆ చేదు అనుభవాల నుంచైనా పాఠాలు నేర్చుకుని తన రాజకీయ శైలిని మార్చుకుంటారని భావిస్తే.. తాజాగా రూ.40 కోట్ల రోడ్ల పెండింగ్ బిల్లుల కోసం చనిపోతానంటూ ఆమరణ దీక్షాస్త్రం సంధించి మరోసారి తన అపరిపక్వతను బట్టబయలు చేసుకున్నారు. రోడ్లు,



కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులనేవి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆర్థిక వెసులుబాటు, ప్రాధాన్యతల ఆధారంగా విడుదలయ్యే పరిపాలనా ప్రక్రియ. రాష్ట్రంలో మిగతా నియోజకవర్గాలన్నింటికీ నిధులు ఇచ్చి, కేవలం తనపైనే వ్యక్తిగత కక్షతో ఆపేశారన్నట్లుగా ఆయన మాట్లాడుతున్న తీరు హాస్యాస్పదంగా ఉంది.

**అంతా తెలిసి కూడా అనిరుధ్ రెడ్డి రాజకీయం**
ప్రభుత్వంలో నిధుల కేటాయింపులు, ట్రెజరీ నిర్వహణ ఎలా సాగుతాయో తెలిసిన ఏ ప్రజాప్రతినిధి కూడా ఇలా బహిరంగంగా చనిపోతానని బ్లాక్‌మెయిలింగ్ తరహా ప్రకటనలు చేయరు. ఉప ముఖ్యమంత్రి, ఆర్ అండ్ బి మంత్రులపై బహిరంగంగా ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తూ, ప్రతిపక్షాలకు ఆయుధాలు అందిస్తున్న తీరు ఆయన రాజకీయ అనుభవలేమిని తేటతెల్లం చేస్తోంది. సొంత నియోజకవర్గంలో రోడ్ల సమస్య వాస్తవమే కావొచ్చు, కానీ దాన్ని శాసనసభ వేదికగానో, ముఖ్యమంత్రి చాంబర్‌లోనే సమన్వయంతో సాధించుకోవాలే తప్ప.. నా ప్రాణం విలువ రూ.40 కోట్లు అంటూ సంచలనాల కోసం డ్రామాలు రక్తికట్టించడం రాజకీయ అపరిపక్వతకు నిదర్శనం.

**కాంగ్రెస్ లో విలువ కోల్పోయిన ఎమ్మెల్యే**
అనిరుధ్ రెడ్డి వంటి అపరిపక్వ నేతలు చేసే వివాదాస్పద విన్యాసాలు కేవలం కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠకే కాకుండా, పరిపాలనపై పట్టు సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా పెద్ద తలనొప్పిగా మారుతున్నాయి. సొంత పార్టీ ఎమ్మెల్యేనే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆమరణ దీక్షలంటూ రంకెలేస్తుంటే.. ప్రజల్లోకి పరిపాలనా వైఫల్యం అనే తప్పుడు సంకేతాలు వెళ్తాయి. పార్టీ అంతర్గత వేదికలపై చర్చించాల్సిన పాలనాపరమైన అంశాలను రోడ్డుపైకి లాగి, సినిమాటిక్ డైలాగులతో చౌకబారు ప్రచారం పొందాలని చూసే ఇలాంటి ధోరణులను అధిష్ఠానం ఇకనైనా తీవ్రంగా పరిగణించకపోతే.. అది పార్టీ ఐక్యతకే కాక ప్రభుత్వ స్థిరత్వానికే చేటు తెచ్చే ప్రమాదముంది. అందుకే అనిరుధ్ రెడ్డిని ఇక లైట్ తీసుకునే అవకాశం ఉంది.

# సుప్రీం కోర్ట్ లో వైసీపీకి ఎదురుదెబ్బ

**అమరావతి, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
సుప్రీంకోర్టులో వైసీపీకి ఎదురుదెబ్బ తగిలింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ గడువును పెంచాలన్న వైసీపీ అభ్యర్థనను న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ ఎన్నికలపై వైసీపీ పిటిషన్‌పై విచారణను ముగించింది. గత విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను తాము పాటించామని ఏపీ ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. నామినేషన్ల సమయం ముగిసినందున 'ఇక




ఎన్నికల్లో పోటీచేయాలి.. ఆల్ ది బెస్ట్' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించా రు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఆ ఫుటేజ్‌ను కూడా భద్రపరచాలని ఎన్నికల కమిషన్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. నామినేషన్లు వేయడానికి ప్రతిపక్ష పార్టీలకు అవకాశం ఇవ్వట్లేదని వైసీపీ తరపు న్యాయవాది మణిందర్ సింగ్ న్యాయస్థానానికి తెలిపారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై తీసుకున్న చర్యలను సుప్రీంకోర్టుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నివేదించింది. ఎన్నికల కమిషన్ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ కౌన్సిల్ సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు.

# జలశక్తి శాఖ ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి సి.ఆర్. పాటిల్ సమీక్ష

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
జలశక్తి శాఖ పరిధిలోని ప్రాజెక్టులు, పథకాలు, కార్యక్రమాల పురోగతిపై కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ సమీక్ష నిర్వహించారు. జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌధరి సమక్షంలో, జలవనరులు, నదుల అభివృద్ధి, గంగా పునరుజ్జీవన శాఖ ఉన్నతాధికారులతో ఈ సమావేశం జరిగింది.
సమావేశంలో వరద నిర్వహణ విభాగం, ఫరక్కా బ్యారేజ్ ప్రాజెక్టు, జాతీయ జల మిషన్, కమాండ్ ఏరియా అభివృద్ధి--జల నిర్వహణ ఆధునీకరణ (ఎం-క్యాడ్‌డబ్ల్యూఎం), బేసిన్ మేనేజ్‌మెంట్, జాతీయ జల అభివృద్ధి సంస్థ, కెన్--బెత్వా లింక్ ప్రాజెక్టు అథారిటీ, బ్రహ్మపుత్ర--బరాక్ నదుల వ్యవహారాలు, బ్రహ్మపుత్ర బోర్డు, చిన్నతరహా సాగునీటి గణాంకాలు, జాతీయ జలవిజ్ఞాన సంస్థ తమ ప్రాజెక్టులు, కార్యకలాపాలపై ప్రజెంటేషన్లు




ఇచ్చాయి.
వరద నిర్వహణ, సరిహద్దు ప్రాంతాల కార్యక్రమం (ఎఫ్ఎంబీఏపీ) కింద పనుల పురోగతి, ఫరక్కా బ్యారేజ్ గేట్ల మార్పిడి, కోత నివారణ చర్యలు, జాతీయ జల మిషన్ ప్రాధాన్య కార్యక్రమాలు, ఎం-క్యాడ్‌డబ్ల్యూఎం కింద 35 పైలట్ క్లస్టర్ల అమలు, కెన్--బెత్వా లింక్ ప్రాజెక్టులో భాగంగా లింక్ కెనాల్, దౌధన్ డ్యామ్ పనుల స్థితిగతులపై చర్చించారు. బ్రహ్మపుత్ర బోర్డు మాస్టర్ ప్లాన్లు, డీపీఆర్‌ల తయారీ, చిన్నతరహా సాగునీటి గణాంకాల కార్యక్రమం కింద కొనసాగుతున్న నాలుగు జనగణనల పురోగతి, జాతీయ జలవిజ్ఞాన సంస్థ లక్ష్యాలు, కార్యక్రమాలపైనా సమీక్షించారు.
ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న అడ్డంకులను గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పనులు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా రాష్ట్రాలతో సమన్వయం పెంచాలని సూచించారు. సమీక్షలో తీసుకున్న నిర్ణయాలపై సంబంధిత విభాగాలు, సంస్థల అధిపతులు నిరంతర పర్యవేక్షణతో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, నిర్ణీత కాలవ్యవధిలో ఆశించిన ఫలితాలు సాధించాలని స్పష్టం చేశారు.

# జగన్ కంచుకోట బద్దలు

**అమరావతి, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
స్థానిక ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి జగన్ కంచుకోట పులివెందులను టీడీపీ బద్దలు కొట్టింది. ఆ నియోజకవర్గ పరిధిలో 65 ఎంపీటీసీ స్థానాలు ఉంటే అందులో 64 స్థానాలను ఏకగ్రీవంగా గెలుచుకుంది. అలాగే 7 జడ్పీటీసీ స్థానాల్లో మూడు తన ఖాతాలో వేసుకుంది. వేంపల్లి మండలంలో 18 ఎంపీటీసీ స్థానాల్లో 17 గెలుపొందింది. ఇప్పటికే పులివెందుల మున్సిపాలిటీలో 40 వార్డులకు 20 వార్డులను టీడీపీ ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. చిత్తూరులో పలు స్థానాలను అధికార కూటమి ఏకగ్రీవంగా గెలుస్తోంది. ఈ జిల్లాలోని మూడు జడ్పీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. యాదమర్రి జడ్పీటీసీగా యశోద, బంగారు పాలెం జడ్పీటీసీగా సుచిత్ర జయప్రకాష్, పూతలపట్టు జడ్పీటీసీగా శైలజ తేజో మూర్తి ఏకగ్రీవంగా గెలిచారు.
అలాగే నంద్యాల జిల్లాలో 8 జడ్పీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. బనగానపల్లె నియోజకవర్గంలోని బనగానపల్లి, కొలిమిగుండ్ల, అవుకు, సంజామల, కోవెలకుంట్ల జడ్పీటీసీ స్థానాలను కూటమి ఖాతాలో వేసుకుంది. డోన్ నియోజకవర్గంలో బేతంచెర్ల, ప్యాపిలి, శ్రీశైలం నియోజకవర్గంలోని వెలుగోడు స్థానాలనూ ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది.

ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
బుధవారం, అక్టోబర్,28, 2026
www.trinetnews.com

# ప్రత్యేక ప్రచారం--6లో పెట్రోలియం శాఖ పురోగతి

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
స్వచ్ఛత, పెండింగ్ అంశాల పరిష్కారంపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ప్రత్యేక ప్రచారం--6లో గణనీయమైన పురోగతి సాధించింది. అక్టోబర్ 25 నాటికి అందిన వివరాల ప్రకారం, పలు అంశాల్లో 100 శాతం లక్ష్యాన్ని చేరుకుంది.
పరిశీలనకు గుర్తించిన 5,593 భౌతిక ఫైళ్ల సమీక్షను పూర్తి చేసింది. మరో 712 ఈ-ఫైళ్లను సమీక్షకు పంపింది. ప్రజా ఫిర్యాదుల అప్పీళ్లలో 500 పరిష్కరించి 100 శాతం పూర్తి చేసింది.ప్రచారంలో భాగంగా 148 ప్రాంతాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 126 చోట్ల చేపట్టింది. కార్యాలయ స్థల వినియోగాన్ని మెరుగుపరిచే చర్యల్లో 1.15 లక్షల చదరపు అడుగుల లక్ష్యానికి మించి 2.22 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని ఖాళీ చేసింది. ప్రచారం ద్వారా రూ.41 కోట్ల ఆదాయం సమకూర్చాలన్న లక్ష్యానికి గాను ఇప్పటివరకు రూ.34.64 కోట్లు సాధించింది.
ప్రజా సేవల పరిష్కారంలో 7,500 ఫిర్యాదుల లక్ష్యానికి గాను 6,006 ఫిర్యాదులను పరిష్కరించింది. ఇది 80.10 శాతం పురోగతి. ఈ-వ్యర్థాలు, స్క్రాప్ తొలగింపు, కార్యాలయాల పరిశుభ్రత, రికార్డుల సమర్థ నిర్వహణ, ఫిర్యాదుల సకాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది.
పెట్రోలియం శాఖకు చెందిన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు, ఇతర విభాగాలు ప్రచారంలో చురుకుగా పాల్గొనాలని సూచించింది. ప్రచారం పురోగతిని క్రమం తప్పకుండా పర్యవేక్షించి, పరిపాలనా సంస్కరణలు--ప్రజా ఫిర్యాదుల విభాగం ప్రారంభించిన ప్రత్యేక వెబ్ పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు పేర్కొంది. ?చ్ఛత, కార్యాలయ స్థలాల మెరుగైన వినియోగం, పెండింగ్ అంశాల సత్వర పరిష్కారంతో పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపింది.

# తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు భక్తులకు పటిష్ట ఏర్పాట్లు : టీటీడీ జేఈవో డా. ఎ. శరత్

**తిరుపతి, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని టీటీడీ జేఈవో డా. ఎ. శరత్ అధికారులను ఆదేశించారు.డిసెంబరు 5న అంకురార్పణతో ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు డిసెంబరు 6 నుంచి 14వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం తిరుచానూరులోని ఆలయం, వాహన మండపం, నాలుగు మాడ వీధులు, పార్కింగ్ ప్రాంతాలు, క్యూలైన్లు, పుష్కరిణి, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఆయన పరిశీలించారు.

**భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యం**
బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రించేందుకు హోల్డింగ్ పాయింట్లు, క్యూలైన్లు, అన్నప్రసాదం, లడ్డూ, టికెట్‌కౌంటర్లను పద్ధతిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా గరుడ వాహనం, గజ వాహనం, పంచమి తీర్థం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలన్నారు.

**విద్యుత్, పుష్పాలంకరణలతో వైభవంగా ఉత్సవాలు**
విజిలెన్స్, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ విభాగాలు, ఆలయ



సిబ్బందిసమన్వయంతో పక్కా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఆలయం, వాహన మండపం, మాడ వీధుల్లో ఆకర్షణీయమైన విద్యుత్, పుష్పాలంకరణలు చేపట్టాలని, వారంలోగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారి దివ్యదర్శనం చేసుకుని ఆమె కృపకు పాత్రులు కావాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సీఈ మనోహరం, డిప్యూటీ ఈవోలు హరీంద్రనాథ్, సెల్వం, ఎస్ఈ వేంకటేశ్వర్లు, వీజీవో గిరిధర, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# కండక్టర్ ప్రవళికకు ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
ఖమ్మం రీజియన్‌లోని మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ ప్రవళికను మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. ఇటీవల ఓ ప్రయాణికుడు తోసివేయడంతో గాయపడిన ప్రవళిక ప్రస్తుతం దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయి సంజీవని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రికి వెళ్లిన మంత్రి ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రవళిక త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ఆయన, ఆమెకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కండక్టర్ ప్రవళిక ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని తెలిపారు. ఆమెకు అందుతున్న వైద్య చికిత్సపై వైద్యులతో మాట్లాడినట్లు పేర్కొన్నారు. ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఆర్టీసీ సిబ్బందికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

ఆర్టీసీ సిబ్బంది భద్రతకు ప్రాధాన్యం
ప్రజలను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడంలో ఆర్టీసీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పేద ప్రజలను గమ్యస్థానాలకు చేరవేస్తున్న ఆర్టీసీ కార్మికుల పట్ల ప్రయాణికులు గౌరవంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఆర్టీసీ సిబ్బంది సాధారణంగా సౌమ్యంగా, నిజాయితీగా విధులు నిర్వహిస్తారని తెలిపారు. సిబ్బంది ప్రవర్తనపై ప్రయాణికులకు ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఆర్టీసీ యాజమాన్యానికి లేదా సంబంధిత అధికారులకు తెలియజేయవచ్చని మంత్రి సూచించారు. అయితే, ఉద్యోగుల ప్రాణాలకు ముప్పు కలిగించేలా వ్యవహరించడం ఏమాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

ఖమ్మం ఘటనపై ప్రభుత్వం సీరియస్
ఖమ్మం ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ కార్మికుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలకు సేవ చేయడం ఆర్టీసీ ఉద్యోగుల బాధ్యత అయినప్పటికీ, వారి ప్రాణాలకు రక్షణ కల్పించడం, విధి నిర్వహణలో భద్రతను నిర్ధారించడం కూడా అంతే ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, సంస్థ పరిరక్షణ లక్ష్యంగా పనిచేస్తున్న ఆర్టీసీకి ప్రజల మద్దతు ఎంతో అవసరమని అన్నారు.
ప్రజా రవాణా వ్యవస్థ సజావుగా కొనసాగాలంటే ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది పరస్పర గౌరవంతో వ్యవహరించాలని మంత్రి సూచించారు. ఇటువంటి దురదృష్టకర ఘటనలు మళ్లీ జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

# బీసీ సంక్షేమ శాఖ పథకాల అమలులో పారదర్శకత, వేగం పెంచాలి
# 38 ఆత్మగౌరవ భవనాల జీవోల ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలి

**డిసెంబర్ 9న లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి**
**తెలంగాణ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల సొంత భవనాలకు స్థల సేకరణ పూర్తి చేయాలిలి**
**బీసీ స్టడీ సర్కిల్ లో కమిటీ నివేదిక ఆధారంగా నూతన సంస్కరణలు అమలు చేయాలి**
**మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,అక్టోబర్ 27:**
సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ సంక్షేమ శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ పరిధిలో అమలవుతున్న పథకాలు, గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఆత్మగౌరవ భవనాలు, నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ, బీసీ వర్గాలకు స్వయం ఉపాధి అవకాశాల కల్పన తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.
మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యా నిధి పథకం అమలుపై మంత్రి సమీక్షించారు. ఈ పథకం ద్వారా అర్హులైన మెరిట్ విద్యార్థులకు పూర్తి పారదర్శకతతో పెండింగ్ లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు 38 ఆత్మగౌరవ భవనాలకు సంబంధించిన జీవోల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.
బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇంటింటా కుట్టు మిషన్ల పథకం అమలుపై మంత్రి సమీక్షించారు. ఈ పథకానికి మహిళల నుంచి మంచి స్పందన లభించిందని, సుమారు 4.80 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. నియోజకవర్గానికి వెయ్యి మంది చొప్పున మొత్తం 1.90 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూర్చేలా ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 9న లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, టెండర్ ప్రక్రియతో పాటు ఇతర అవసరమైన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.రాజీవ్ యువ వికాసం పథకం కింద వచ్చిన దరఖాస్తుల వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందే వారిలో బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించే అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు.
రాష్ట్రంలోని 327 మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో ఆర్సీవోలు పర్యటించి మౌలిక



సదుపాయాలు, సిబ్బంది, విద్యార్థుల సంఖ్య, ఖాళీలు, సొంత భవనాల స్థితిగతులు తదితర అంశాలపై నివేదికలు అందించినట్లు మంత్రి తెలిపారు. ఈ నివేదికల ఆధారంగా పాఠశాలల్లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
రాష్ట్రంలోని 327 గురుకుల పాఠశాలల్లో కేవలం 26 పాఠశాలలకు మాత్రమే సొంత భవనాలు ఉండగా, మిగిలిన 301 పాఠశాలలు ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. 37 గురుకులాలకు సొంత స్థలాలు ఉన్నందున వాటిలో భవనాల నిర్మాణానికి అనుమతులు, నిధులు మంజూరు చేసే అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. గురుకులాలకు కూడా సొంత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అధికారులు గురుకుల పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించాలని, జిల్లా కలెక్టర్లు నెలకు ఒక గురుకుల పాఠశాలను సందర్శించి నివేదిక అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గురుకులాలకు అవసరమైన స్థలాల సేకరణను త్వరగా పూర్తి చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించారు.
నవంబర్ మొదటి వారంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్, జిల్లా కలెక్టర్లు, ఆర్సీవోలు, ప్రిన్సిపాళ్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గురుకులాల సమస్యల పరిష్కారంపై సమీక్షించనున్నట్లు తెలిపారు. గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, బీసీ సంక్షేమ శాఖ హాస్టల్ వార్డెన్లకు లేఖలు రాసి విద్యార్థులకు ఎల్ నినో ప్రభావం, నీటి పొదుపు, విద్యుత్ వినియోగంలో మితవ్యయం తదితర అంశాలపై అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా వారు తమ తల్లిదండ్రులకు కూడా ఈ అంశాలను వివరించే అవకాశం ఉంటుందని తెలిపారు. బీసీ స్టడీ సర్కిళ్లలో సంస్కరణలు చేపట్టి నిరుద్యోగులకు ఉద్యోగాలే లక్ష్యంగా నాణ్యమైన శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ అంశంపై ఐదుగురు సభ్యుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా సమర్థవంతమైన డైరెక్టర్ల నియామకానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. డైరెక్టర్ల ఎంపిక కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, యూపీఎస్సీ, గ్రూప్-1 వంటి పోటీ పరీక్షల్లో మెరిట్ సాధించిన వారికి అవకాశాలు కల్పించేలా ఎంపిక ప్రక్రియ చేపట్టాలని తెలిపారు.
బీసీ కార్పొరేషన్ ద్వారా శిక్షణ పొందిన వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. మధిర వంటి నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా పశువుల పంపిణీ తరహా ఉపాధి పథకాన్ని ప్రారంభించి, లబ్ధిదారుల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ పథకం కింద చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు వివిధ కుల సంఘాలకు నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు, ఆర్థిక వృద్ధి పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బీసీ వితంతువులు, ఒంటరి మహిళలకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో రజకుల కోసం ఆధునిక ధోబీఘాట్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై బలహీనవర్గాల ఐకాన్‌లుగా నిలిచిన ప్రముఖుల విగ్రహాలకు పేర్లు రాయించే పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.
కాటమయ్య రక్షణ కవచాల పంపిణీపై సమీక్షిస్తూ, శిక్షణ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు వాటిని అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీరా కేఫ్, నందనవనాల నిర్వహణ, అభివృద్ధి అంశాలపై మంత్రి చర్చించారు. వాటిని అధికారులు స్వయంగా సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలని ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని పథకాలు అర్హులైన లబ్ధిదారులకు సమర్థవంతంగా చేరేలా, స్వయం ఉపాధి అవకాశాలు పెరిగేలా, గురుకులాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయాదేవి, మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల కార్యదర్శి సైదులు, అధికారులు మల్లయ్య భట్టు, అలోక్ కుమార్, పద్మ, మామిడి హరికృష్ణ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీహార్ గ్రామీణ బ్యాంకు ఉద్యోగులకు రూ.77.69 కోట్ల ప్రయోజనాలు

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
బీహార్ గ్రామీణ బ్యాంకు యాజమాన్యం, ఉద్యోగ సంఘాల మధ్య నెలకొన్న రెండు పారిశ్రామిక వివాదాలు సయోధ్య చర్చలతో పరిష్కారమయ్యాయి. అక్టోబర్ 22, 23 తేదీల్లో కేంద్ర కార్మిక కమిషనర్ కార్యాలయం ఆధ్వర్యంలో పాట్నాలోని సహాయ కార్మిక కమిషనర్ (సెంట్రల్) ఈ చర్చలు నిర్వహించారు.ఈ ఒప్పందాల ద్వారా బీహార్ గ్రామీణ బ్యాంకులో పనిచేస్తున్న 10,900 మందికి పైగా ఉద్యోగులకు సుమారు రూ.77.69 కోట్ల ఆర్థిక ప్రయోజనాలు అందనున్నాయి. వీటిలో బీహార్ గ్రామీణ బ్యాంకు వర్కర్స్ ఆర్గనైజేషన్‌తో కుదిరిన ఒప్పందం ద్వారా ఏటా పునరావృతమయ్యే ప్రయోజనాలు సుమారు రూ.9.02 కోట్లుగా ఉంటాయని అధికారులు తెలిపారు.
అక్టోబర్ 22న బీహార్ గ్రామీణ బ్యాంకు అధికారుల సంఘం, పాట్నా, బ్యాంకు యాజమాన్యం మధ్య



మొదటి ఒప్పందం కుదిరింది. దీనివల్ల సుమారు 8,400 మంది ఉద్యోగులకు రూ.67.17 కోట్ల మేర ప్రయోజనం చేకూరనుంది. పనితీరు ఆధారిత ప్రోత్సాహకం (పీఎల్ఐ), అదనపు బాధ్యతల భత్యం, వేతనాల పెంపు, ప్రయాణ భత్యం పెంపు, పదోన్నతులు, కారుణ్య నియామకాలు వంటి అంశాలు ఈ ఒప్పందంలో ఉన్నాయి.
అక్టోబర్ 23న బీహార్ గ్రామీణ బ్యాంకు వర్కర్స్ ఆర్గనైజేషన్ (బీజీబీడబ్ల్యూఓ), బ్యాంకు యాజమాన్యం మధ్య రెండో ఒప్పందం జరిగింది. దీని ద్వారా సుమారు 2,500 మంది ఉద్యోగులకు రూ.10.52 కోట్ల ప్రయోజనాలు అందనున్నాయి. ఇందులో ఏటా లభించే ప్రయోజనాలు సుమారు రూ.9.02 కోట్లు. 12వ ద్వైపాక్షిక ఒప్పందం అమలు, ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ) పెంపు, దివ్యాంగ ఉద్యోగులకు రవాణా భత్యం పెంపు, ఓవర్‌టైమ్ చెల్లింపులు, పదోన్నతుల్లో పారదర్శకత, చర్చల మండలి ఏర్పాటు తదితర అంశాలపై అంగీకారం కుదిరింది.
ఉద్యోగ సంఘాలు, బ్యాంకు యాజమాన్యం చర్చల్లో చురుకుగా పాల్గొనడంతో వివాదాలు సామరస్యంగా పరిష్కారమయ్యాయని కార్మిక శాఖ పేర్కొంది. ఉద్యోగుల ప్రయోజనాల పరిరక్షణ, న్యాయమైన కార్మిక విధానాల ప్రోత్సాహం, పరిశ్రమల్లో సుహృద్భావ సంబంధాల బలోపేతానికి ఈ సయోధ్య చర్యలు దోహదపడతాయని తెలిపింది.

# కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్--2026 ప్రారంభమైంది. న్యూఢిల్లీలోని సతర్కతా భవన్‌లో ఉదయం 11 గంటలకు కేంద్ర విజిలెన్స్ కమిషనర్ ఏ.ఎస్. రాజీవ్, విజిలెన్స్ కమిషనర్ ప్రవీణ్ వశిష్ట కమిషన్ అధికారులు, సిబ్బందితో నిజాయితీ ప్రతిజ్ఞ చేయించారు.ఈ ఏడాది అక్టోబర్ 26 నుంచి నవంబర్ 1 వరకు "సమృద్ధి కోసం నైతికత" అనే ఇతివృత్తంతో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌ను నిర్వహిస్తున్నారు.విజిలెన్స్ వ్యవస్థను మరింత సమర్థంగా తీర్చిదిద్దేందుకు ఆగస్టు 17 నుంచి నవంబర్ 16 వరకు మూడు నెలల నివారణ విజిలెన్స్ ప్రచారాన్ని చేపట్టాలని కేంద్ర ప్రభుత్వంలోని అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థలకు కమిషన్ సూచించింది. ఈ ప్రచారంలో పెండింగ్



ఫిర్యాదులు, కేసుల పరిష్కారం, సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలు, డిజిటల్ చర్యలు, ఒప్పందాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొంది. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా అక్టోబర్ 30న "సాంకేతికత ద్వారా పరివర్తన" అంశంపై ఒకరోజు కార్యశాలను కమిషన్ నిర్వహించనుంది.

# అర్బబ్' ఎఫెక్ట్.. విశాఖ బీచ్ వద్ద ఎగిసిపడుతున్న అలలు: గోకుల్ పార్క్ వరకు తాకుతున్న సముద్రపు నీరు – ఆందోళనలో స్థానికులు!



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:

తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్బబ్' తుపాన్ ప్రభావం ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలపై తీవ్రంగా చూపుతోంది. ముఖ్యంగా విశాఖపట్నం తీర ప్రాంతంలో సముద్రం ఒక్కసారిగా అల్లకల్లోలంగా మారిపోయింది.

భయపెడుతున్న భారీ అలలు:

సముద్రపు అలలు సాధారణ స్థాయికి మించి దాదాపు 30 అడుగుల ఎత్తున ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. అలల తీవ్రత ఎక్కువగా ఉండటంతో పాటు సముద్రం అంత ఎత్తున ముందుకు రావడం వల్ల, గోకుల్ పార్క్ సమీపంలో నేరుగా తీరాన్ని తాకుతున్నాయి. ఈ భయానక వాతావరణం తీర ప్రాంత ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది.

స్థానికుల రాక – అధికారుల హెచ్చరికలు:

సముద్రం ముందుకు వచ్చిన ఈ వింత మరియు భయానక పరిస్థితిని కళ్లారా చూసేందుకు స్థానికులు పెద్ద ఎత్తున బీచ్‌ల వైపు తరలివస్తున్నారు. అయితే ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే అప్రమత్తమయ్యారు. ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా, సముద్ర తీరానికి వెళ్లే పర్యాటకులు మరియు స్థానికులు అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ బీచ్‌ల వైపు రావద్దని అధికారులు గట్టి హెచ్చరికలు జారీ చేశారు.

# పులివెందులలో రాజకీయ వేడెక్కుతున్న వాతావరణం: నేతలు, కార్యకర్తలతో వైఎస్ జగన్ కీలక భేటీ – మున్సిపల్, జడ్పీటీసీ ఎన్నికలపై వ్యూహాత్మక చర్చ!



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సమరం రంజుగా మారుతున్న వేళ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కీలక చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా పులివెందుల నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు మరియు కార్యకర్తలతో ఆయన కాసేపట్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన సమావేశాన్ని నిర్వహించనున్నారు.

**ఎన్నికల వ్యూహాలపై ప్రత్యేక దృష్టి:**

రాబోయే మున్సిపల్ మరియు జడ్పీటీసీ ఎన్నికలను వైఎస్సార్‌సీపీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ముఖ్యంగా కంచుకోటగా భావించే పులివెందులలో పార్టీ గెలుపును మరింత లాంఛనప్రాయం చేయడానికి, ఎలాంటి లోపాలు లేకుండా వ్యూహాలు రచించేందుకు ఈ భేటీ జరగనుంది. స్థానిక సంస్థల పోరులో అనుసరించాల్సిన ప్రచార సరళి, వ్యూహాలు మరియు ప్రత్యర్థుల నుంచి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే అంశాలపై ఈ సమావేశంలో లోతుగా చర్చించనున్నారు.

**భాగస్వామ్యం మరియు అభ్యర్థుల ఎంపిక:**

ఈ అత్యవసర సమావేశంలో ఎన్నికల బరిలో నిలవబోయే అధికారిక అభ్యర్థులతో పాటు, నియోజకవర్గానికి చెందిన పలువురు కీలక నేతలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఆశావహులు భారీ సంఖ్యలో పాల్గొననున్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ స్వయంగా అభ్యర్థులతో మాట్లాడి దిశానిర్దేశం చేయనుండటంతో స్థానిక క్యాడర్‌లో జోష్ మరింత పెరిగింది. ఎన్నికల్లో పార్టీ విజయం సాధించడానికి నాయకులంతా సమన్వయంతో పనిచేయాలని ఆయన ఈ భేటీలో పిలుపునిచ్చే అవకాశం ఉంది.

# దుర్గం చెరువులో దూకి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య: విషాదకర ఘటన - మృతుడు విశాఖ వాసి!



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విశాఖపట్నానికి చెందిన ఒక యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నగరంలోని ప్రసిద్ధ దుర్గం చెరువులో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

**సంఘటన వివరాలు:**

విశాఖపట్నానికి చెందిన 25 ఏళ్ల యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రాజేష్ హైదరాబాద్‌లోని నాచారంలో ఒక హాస్టల్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం నాడు మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో ఉంటున్న తన స్నేహితులను కలిసేందుకు వచ్చాడు. అయితే ఆ తర్వాత ఊహించని విధంగా జరిగిన ఈ విషాదకర ఘటనలో అతను దుర్గం చెరువులో దూకి ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు.

**పోలీసుల ధృవీకరణ:**

మృతుడు విశాఖపట్నానికి చెందిన వ్యక్తిగా పోలీసులు ప్రాథమికంగా ధృవీకరించారు. ఈ ఘటనకు గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పెద్దారెడ్డి ఇంటిపై సంచలన దాడి: బయటపడ్డ జేసీ అనుచరుల కీలక వీడియో!



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి నివాసంపై జరిగిన దాడికి సంబంధించిన ఒక కీలక వీడియో తాజాగా బయటకు వచ్చి రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఈ వీడియోలో ప్రత్యర్థి వర్గానికి చెందిన జేసీ వర్గీయులు పెద్దారెడ్డి ఇంటిపై దాడికి పాల్పడినట్లు స్పష్టమైన దృశ్యాలు రికార్డయ్యాయి.

**వీడియోలో వెలుగుచూసిన నిజాలు:**

స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టిస్తున్న ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ దాడికి పాల్పడిన వ్యక్తులు జేసీ అనుచరులేనని స్పష్టమైన ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల వేళ ప్రత్యర్థి వర్గాల మధ్య నెలకొన్న కక్షలు, ఉద్రిక్త పరిస్థితులకు ఈ దాడి అద్దం పడుతోంది.

**మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది:**

ఈ దారుణ ఘటనకు సంబంధించి పూర్తి స్థాయి విచారణ జరగాల్సి ఉండగా, ఇందుకు సంబంధించిన మరింత సమాచారం ఇంకా అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది. ఈ పరిణామాలపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# అర్బన్ తుఫాన్ బీభత్సం.. కళ్లెదుటే విధ్వంసమైన నగరానికి ఇది ప్రత్యక్ష సాక్ష్యం!




ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుఫాన్ రూపంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై పెను విపత్తు ముంచుకొచ్చింది. పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ తీవ్ర తుఫాన్ తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తీరం దాటే సమయాల్లో గంటకు నూట పదిహేను నుంచి నూట ఇరవై ఐదు కిలోమీటర్ల వేగంతో, కొన్ని సందర్భాల్లో ఏకంగా నూట నలభై కిలోమీటర్ల వేగంతో భయానక ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని స్పష్టం చేసింది.

**రాష్ట్రంలో వర్షాలు మరియు ప్రభావం చూపనున్న ప్రాంతాలు:**

తుఫాన్ ముప్పు నేపథ్యంలో కోస్తాంధ్ర మరియు ఉత్తరాంధ్ర జిల్లాలలో కుంభవృష్టి వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్ జిల్లా, విశాఖపట్నం అలాగే ఉమ్మడి గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. సముద్రం అల్లకల్లోలంగా మారి అలలు ఎగసిపడుతుండటంతో తీర ప్రాంతాల్లో భారీ ఉప్పెన వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**నగరాల్లో విలయం - ప్రత్యక్ష దృశ్యాలు:**

ప్రస్తుతం నగరాలు, పట్టణాల్లో విరుచుకుపడుతున్న ఈదురుగాలుల బీభత్సానికి జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. ఈ సీసీటీవీ లైవ్ వీడియో దృశ్యాలే దీనికి పూర్తి ప్రత్యక్ష సాక్ష్యం. పెనుగాలుల ఉధృతికి నిమిషాల వ్యవధిలోనే భారీ వాణిజ్య సముదాయాలు, భవనాల పైకప్పులు, రేకుల షెడ్లు అట్టపెట్టల మాదిరిగా ఎగిరిపోయాయి. రోడ్లపై నిలిపి ఉంచిన కార్లపై భారీ శిథిలాలు పడటంతో వాహనాలన్నీ నుజ్జునుజ్జయ్యాయి. గాలుల తీవ్రత ఎంతలా ఉందంటే రోడ్డుపై నడుస్తున్నవారు, వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీయాల్సి వచ్చింది.

**అంధకారంలోకి నగరాలు - అధికార యంత్రాంగం అప్రమత్తం:**

తుఫాన్ ధాటికి విద్యుత్ వ్యవస్థ పూర్తిగా కూలిపోవడంతో తీర ప్రాంత నగరాలన్నీ అంధకారంలోకి వెళ్లిపోయాయి. కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతినడంతో ఎక్కడ చూసినా భయాందోళన వాతావరణం నెలకొంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వ యంత్రాంగం, విపత్తు నిర్వహణ బృందాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ప్రజలెవరూ అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని, అధికారులు ఇచ్చే హెచ్చరికలను ఎప్పటికప్పుడు పాటించాలని కోరారు.

# రాయికల్ ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల భవన నిర్మాణానికి రూ.10 లక్షల ప్రొసీడింగ్ ఇచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:

జగిత్యాల జిల్లా రాయికల్ మండల గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల భవన నిర్మాణం కోసం రూ.10 లక్షల నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మంగళవారం అందజేశారు. వైద్యుల భవన నిర్మాణానికి నిధులు కేటాయించడంతో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించే వారికి సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ఈ సందర్భంగా ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు అని రాయికల్ మున్సిపాల్ మాజీ కోప్షన్ మెంబర్ డాక్టర్ పిప్పోజి మహేందర్ బాబు తెలిపారు





# జగిత్యాల కలెక్టరేట్ ప్రభుత్వ పెట్రోల్ బంక్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:

జగిత్యాల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కలెక్టరేట్ ప్రభుత్వ పెట్రోల్ బంక్‌ను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, ప్రారంభించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారంతో ఈ పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేశారు. ప్రజలు, అధికారులు, ఉద్యోగులు, వాహనదారులకు ఇంధనాన్ని సులభంగా అందుబాటులోకి తీసుకురావడమే దీని ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెట్రోల్ బంక్‌లో నాణ్యత ప్రమాణాలు, సరైన కొలతలు, భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన సేవలు అందించాలని, నిర్వహణలో పారదర్శకత పాటించాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వై. ప్రసాద్, ఆర్డీఓ మధుసూదన్, కలెక్టరేట్ ఏఓ కిషన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, పెట్రోల్ బంక్ సిబ్బంది, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మల్లికార్జున కార్గే మోదీ పై అనుచిత వాఖ్యల్ని ఖండించిన భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఏసిఎస్ రాజు

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:

జగిత్యాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో భారత్ సురక్ష సమితి నాయకులు ఏసిఎస్ రాజు జిల్లా అధ్యక్షులు అక్కినపల్లి కాశీనాథం సమరసత వేదిక కరీంనగర్ విభాగ్ సంయోజక్ చిట్ల గంగాధర్ లు మాట్లాడుతూ ఆదివారం పాట్నాలో జరిగిన ఒక సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సహనం కోల్పోయి ఆవేశంతో మోడీ నే కాకుండా మోడీ తండ్రిని కూడా జైలుకు పంపిస్తామని మాట్లాడటం "ఇశీగీత జ్ఞానం లేక ఆదిమానవునిగా" అతని వయసుకు తగిన మాటలు కావని అన్నారు

లోక్ సభ, రాష్ట్ర శాసనసభలకు జరిగే ప్రతి ఎన్నికలలోనూ ఓటమి పాలు కావడంతో అసహనంతో, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ పై అనుచిత వాఖ్యల్ని చేయటాన్ని తీవ్రంగా ఖండించారు.

భారతీయ సంస్కృతిలో పెద్దవాళ్లను, చనిపోయిన వాళ్లను, తండ్రి లాంటి వాళ్లను గౌరవించడం మన సాంప్రదాయమని కానీ ఒక పార్టీ అధ్యక్ష స్థానంలో ఉండి 84 ఏళ్ల వయసు కలిగి వృద్ధాప్యంలో మతిస్మితం లేకుండా ఉండి కూడా సహనాన్ని కోల్పోవడం సరికాదని అన్నారు.



సర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని, అక్రమాలకు పాల్పడిన వారిని జైలుకు పంపిస్తామని పేర్కొనటం కాంగ్రెస్ నాయకుల అవివేకానికి నిదర్శనమని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తొలగించిన 13 కోట్ల ఓట్లకు సంబంధించిన వివరాలను వెల్లడించినప్పటికీ ఓటు కోల్పోయిన ఒక్క ఓటరు ను కూడా చూపించే ధైర్యం లేని కాంగ్రెస్ ప్రతిపక్ష పార్టీలు దేశంలో అల్లర్లు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కల్పించే కుట్రలకు పూనుకుంటున్నాయని అన్నారు. సర్ ప్రక్రియ అనేది దేశ ప్రయోజనాల కొరకు ఉద్దేశించబడినప్పటికీ ఓటు బ్యాంకు రాజకీయాలతో అక్రమంగా ఈ దేశంలో స్థిరపడినటువంటి వాళ్లకు మద్దతు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారని వీరు చేసే ఆందోళనకు ప్రజల మద్దతు ఏ మాత్రం లేదని దేశ భద్రతకు వ్యతిరేకంగా వీరు చేసే ప్రయత్నాలన్నిటిని దేశ పౌరులు గ్రహించాలని దేశభక్తులైన ప్రజలు వీరి కుట్టలను తెప్పికొట్టాలని కోరారు.

ఈ సమావేశంలో కార్యదర్శి సింగం గంగాధర్ 22వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి వేముల పోచమల్లు ఎడమల వెంకట్ రెడ్డి ఆర్ఎస్ఎస్ వీరన్న కొత్తకొండ గాదాసు భూమన్న బాసెట్టి ప్రభాకర్ నరేందుల శ్రీనివాస్ సిరిపురం గంగారం వేముల దేవరాజం బాసెట్టి దుబ్బరాజం బొందుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# రాయికల్ పట్టణంలో సరస్వతి విద్యాలయలో నూతన భవన నిర్మాణానికి రెండు లక్షల రూపాయలు విరాళం అందజేసిన డాక్టర్ వాసలా శ్రీధర్

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:

సనాతన ధర్మం కాపాడాలని మన పిల్లలు కూడా మన ధర్మాన్ని ముందు తీసుకెళ్లాలని వారికి మన ధర్మ విషయాలను కేవలం సరస్వతి శిశు మందిర్ గురువులే వీరికి చిన్నతనం నుండి నేర్పించడంలో సరస్వతి విద్యాలయం ఎంతో గొప్పది దానిని పునర్ నిర్మిశీచాలని రాయికల్ పట్టణ నాయకులు చేస్తున్న కృషి అభినందనీయం

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణం సరస్వతీ శిశు మందిరం అభివృద్ధి మరియు నూతన భవన నిర్మాణం కోసం డాక్టర్ వాసల శ్రీధర్ సరస్వతీ శిశు మందిరం భవన నిర్మాణ కమిటీ అధ్యక్షులు బోడుగం మోహన్ రెడ్డికి 2,00,000/- (రెండు లక్షల రూపాయలు) విరాళంగా ప్రకటించడం ఎంతో ప్రశంసనీయం.

విద్యాసంస్థ అభివృద్ధిని కాంక్షిస్తూ, భావితరాల విద్యాభివృద్ధికి బాటలు వేయాలనే సదుద్దేశంతో మీరు ప్రకటించిన ఈ మహత్తర విరాళం మా సంస్థకు ఎంతో స్ఫూర్తిదాయకం. మీ ఉదారత, విద్య పట్ల మీకున్న నిబద్ధత, సమాజం పట్ల మీకున్న బాధ్యతాభావం అభినందనీయమైనవి.

మీ ఈ గొప్ప సహకారం ద్వారా సరస్వతీ శిశు మందిరం భవన నిర్మాణానికి మరింత ప్రోత్సాహం లభించడమే కాకుండా, భవిష్యత్తులో మరెందరో దాతలకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశిస్తున్నాము.

ఈ సందర్భంగా డాక్టర్ వాసాల శ్రీధర్ కి మా ధన్యవాదాలు

మీకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని, మీరు చేపట్టే ప్రతి కార్యంలో విజయం సాధించాలని సరస్వతి శిశు మందిర్ విద్య కమిటీ మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము




# జగిత్యాల పద్మనాయక కళ్యాణమండపంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్.





ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:

జగిత్యాల వెలమ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో, సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ వారి సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని జగిత్యాల పద్మనాయక ఫంక్షన్ హాల్ లో ప్రారంభించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ,**

ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ సురేందర్ రావు,కేడీసీసీ జిల్లా సభ్యులు రామచందర్ రావు,వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సాగర్ రావు,ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్ రావు,పాక్స్ చైర్మెన్ లు దామోదర్ రావు సందీప్ రావు,ఏఎంసీ చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి,

మాజీ అధ్యక్షులు పురుషోత్తం రావు, కౌన్సిలర్ దుమాల రాజ్ కుమార్,మాజీ జడ్పీటీసీ పెండెం రాములు,బాల ముకుందం, శరత్ రావు,ములసపు మహేష్ ,ప్రవీణ్ రావు,కార్యవర్గ సభ్యులు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.3 వేల కోట్లతో జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం చూపాలి

**- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలి..**

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సమస్యను పరిష్కరించాలి: ఎంపీ ఈటల రాజేందర్**

**- డంపింగ్ యార్డు తొలగించే వరకు పోరాటం ఆగదు..**

**నాలుగు రోజుల పాటు బీజేపీ పాదయాత్ర**

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:




జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 వేల నుంచి రూ.3 వేల కోట్ల వరకు నిధులు కేటాయించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చెత్తను పూర్తిగా శుద్ధి చేసే చర్యలు చేపట్టాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డును తొలగించే వరకు ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

ఎదులాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. గత 12 ఏళ్లుగా జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు జేఏసీ ఏర్పాటు చేసుకుని పోరాటం చేస్తున్నారని తెలిపారు. డంపింగ్ యార్డు నిర్వహణలో నిబంధనలు పాటించాలని సుప్రీంకోర్టు జరిమానా విధించిన విషయాన్ని ప్రస్తావించారు. గతంలో రేవంత్ రెడ్డి మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడు ఈ సమస్యపై ఎన్జీటీ, సుప్రీంకోర్టుల్లో కేసులు వేశారని గుర్తుచేశారు. ప్రశ్నించే గొంతుక ముఖ్యమంత్రి కావడంతో సమస్య పరిష్కారమవుతుందని భావించామని, అయితే రెండేళ్లు గడిచినా ఆశించిన స్పందన కనిపించడం లేదని విమర్శించారు.

**రూ.3 వేల కోట్లతో చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం**

జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్యపై తాను పార్లమెంటులో ప్రశ్నించానని, కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఈటల రాజేందర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించి కేంద్రంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

ప్రస్తుత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చెత్తను సమర్థవంతంగా శుద్ధి చేసి, తిరిగి వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో రోడ్ల నిర్మాణానికి ఉపయోగించే డాంబర్ తయారు చేయవచ్చని, తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువులు ఉత్పత్తి చేయవచ్చని, పొడి చెత్త నుంచి విద్యుత్ తయారు చేయవచ్చని వివరించారు. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని జవహర్ నగర్ డంపింగ్ యార్డులో పేరుకుపోయిన వ్యర్థాలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని విశ్వసిస్తారని పేర్కొన్న ఆయన, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తే ప్రజల సమస్యలను పరిష్కరించవచ్చన్నారు. అందువల్ల ముఖ్యమంత్రి ఈ అంశంపై దృష్టి సారించి అవసరమైన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

**కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు**

జవహర్ నగర్ డంపింగ్ యార్డు ప్రభావంతో పరిసర ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల ఉపాధి దెబ్బతిన్నదని, కలుషిత నీరు తాగిన పశువులు చనిపోతున్నాయని, పశువులకు గర్భస్రావాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారని పేర్కొన్నారు.

ఎదులాబాద్ ప్రాంతంలో క్యాన్సర్‌తో పలువురు మరణించారని, అనేక మంది దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారని ఆయన ఆరోపించారు. కలుషిత నీటితో చర్మవ్యాధులు వస్తున్నాయని, వ్యవసాయం, పాడి పరిశ్రమ, మత్స్య సంపదపై ప్రతికూల ప్రభావం పడుతోందని తెలిపారు. ఒకప్పుడు పచ్చని పొలాలతో కళకళలాడిన ప్రాంతాలు ప్రస్తుతం కాలుష్య సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

సుశీల అనే మహిళ క్యాన్సర్‌తో మరణించినట్లు సభలో ప్రస్తావిస్తూ, ఇటీవల 25 ఏళ్ల యువకుడు కూడా క్యాన్సర్‌తో చనిపోయారని తెలిపారు. ఈ మరణాలకు డంపింగ్ యార్డు కాలుష్యమే కారణమని నిర్ధారించే వైద్యపరమైన ఆధారాలను మాత్రం సంబంధిత అధికారులు పరిశీలించాల్సి ఉంది.

**నాలుగు రోజుల పాటు బీజేపీ పాదయాత్ర**

జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కోసం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఈటల రాజేందర్ తెలిపారు. చివరి రోజు బాలాజీనగర్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ పాదయాత్రకు ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ నాలుగు రోజుల పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని చెప్పారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని వివిధ నియోజకవర్గాల నుంచి ప్రజలు, కార్యకర్తలు తరలివచ్చి పాదయాత్రకు మద్దతు తెలుపుతున్నారని పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యమ సమయంలో 14 ఏళ్ల పాటు వెనుకడుగు వేయకుండా పోరాడిన స్ఫూర్తితోనే ఇప్పుడు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుకు వచ్చామని తెలిపారు. డంపింగ్ యార్డు బాధితుల సమస్యలను అర్థం చేసుకున్నామని, పరిష్కారం లభించే వరకు వారికి అండగా ఉంటానని ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. ఈ పోరాటంలో బాధితులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

# అంతర్గాం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్




ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:

జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం2 భవనాన్ని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, చిన్నారులకు మెరుగైన వాతావరణంలో పౌష్టికాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య సేవలు అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో కీలకమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

రాష్ట్రంలో అత్యుత్తమ స్థలం లో మెడికల్ కాలేజీ,ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం.అంతర్గం గ్రామంలో 12 కోట్ల తో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు.జగిత్యాల అంతర్గం ,లింగం పెట్ అంతర్గం లో రైల్వే అండర్ పాస్ ల ఏర్పాటుకు కృషి చేస్తున్నా.

వీబీగ్రామ్ పథకం లో నియోజకవర్గానికి 100 కోట్ల నిధులు సీఎం మంజూరుకు హామీ ఇచ్చారు.

నియోజకవర్గ అభివృద్ధికి సీఎం సానుకూలంగా ఉన్నారు..

ఎల్ నీ నో పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...

ప్రతి ఇంటిలో పక్షులకు నీటి తొట్టెలు పెట్టాలి..

పర్యావరణాన్ని కాపాడుకోవడానికి కృషి చేయాలని..

కరెంట్ నీరు పొదుపుగా వాడాలి.

జగిత్యాల నియోజకవర్గం లో అంగన్వాడి భవనాల మంజూరు కు కృషి చేస్తా అన్నారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ నోముల రమ్యశేఖర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ లు కొలుగూరీ దామోదర్ రావు,సందీప్ రావు ,ఎంపీడీఓ రమాదేవి,తాసిల్దార్ హకీమ్,సీడీపీఓ , ఉప సర్పంచ్ బాలు గౌడ్ మాజీ సర్పంచులు నక్కల రవీందర్ రెడ్డి, బోనగిరి నారాయణ,జిల్లా మండల సర్పంచుల ఫోరం బొలిశెట్టి గంగారెడ్డి,కట్ట రాజేందర్, మండల పార్టీ అధ్యక్షుడు బాల ముకుందం మాజీ జడ్పీటీసీ పెండెం రాములు ఏఎంసీ డైరెక్టర్ రాజి రెడ్డి పాక్స్ డైరెక్టర్ రాజయ్య ఎంపీవో రవి బాబుసీడీపీఓ జయప్రద,ఏసీడీపీ రాజేశ్వరి, సూపర్వైజర్ మమత, ఏఈ విజయ్ మాజీ ఎంపీటీసీ రాజి రెడ్డి,ములసపు మహేష్,పడిగేల స్వామి రెడ్డి,స్వామి రెడ్డి సతీష్ అరుణ్, వార్డు సభ్యులు ,ప్రతినిధులు ,ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మెట్పల్లిలో టీటీడీ కళ్యాణ మండపంలో సౌకర్యాలు కల్పించాలి. ఈ-దర్శన్ టోకెన్ కౌంటర్‌ను పునరుద్ధరించాలి....




**-బీజేపీ పట్టణ అధ్యక్షుడు దోనికెల నవీన్...**

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో అవసరమైన సౌకర్యాలు కల్పించి, సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో శుభకార్యాలు నిర్వహించుకునే అవకాశం కల్పించాలని బీజేపీ మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు దోనికెల నవీన్ కోరారు.

ఈ సందర్భంగా ఆయన టీటీడీ కళ్యాణ మండపాన్ని సందర్శించి, అక్కడి ప్రస్తుత పరిస్థితులను పరిశీలించారు. మండపం నిర్వహణ, అభివృద్ధి, ప్రజలకు అందుబాటులో ఉన్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.

ప్రస్తుతం పెరుగుతున్న ధరలు, ప్రైవేట్ ఫంక్షన్ హాళ్ల అధిక అద్దెల కారణంగా సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు వివాహాలు, ఇతర శుభకార్యాలు నిర్వహించుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని నవీన్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో టీటీడీ కళ్యాణ మండపంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, తక్కువ ఖర్చుతో శుభకార్యాలు నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.

అదేవిధంగా, గతంలో టీటీడీ కళ్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన ఈ-దర్శన్ టోకెన్ కౌంటర్ ద్వారా భక్తులకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు అందుబాటులో ఉండేవని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆ సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో స్థానిక భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటూ, ఈ-దర్శన్ టోకెన్ కౌంటర్‌ను తిరిగి ప్రారంభించాలని బీజేపీ మెట్‌పల్లి పట్టణ శాఖ తరఫున డిమాండ్ చేశారు.

సంబంధిత అధికారులు ఈ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, కళ్యాణ మండపాన్ని అభివృద్ధి చేయడంతో పాటు భక్తులకు దర్శన టికెట్ల సౌకర్యాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. సామాన్య ప్రజలు, మధ్యతరగతి కుటుంబాలు, భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి బీజేపీ మెట్‌పల్లి పట్టణ శాఖ నిరంతరం కృషి చేస్తుందని దోనికెల నవీన్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు జూంగుల అనిల్ గౌడ్, బత్తుల జగదీశ్వర్, పట్టణ ఉపాధ్యక్షుడు గుంటుక హనుమాన్లు, ఐటీ సెల్ కన్వీనర్ పాసికంటి శ్రీనివాస్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సంకు ప్రసాద్, బొమ్మన రామస్వామి, మొగిలిపాక హరికృష్ణ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# రాయికల్లో భవిత కేంద్రం ఆధ్వర్యంలో మండల స్థాయి దివ్యాంగ పిల్లలకు వివిధ ఆటల పోటీలు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఆటల పోటీలు

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:

దివ్యాంగులను వారికి ఇష్టమైన రంగంలో రాణించేలా ప్రోత్సహిం చాలని జగిత్యాల జిల్ల రాయికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియం ప్రధానోపాధ్యాయులు యం. శ్రీనివాస్ అన్నారు

రాయికల్ పట్టణంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం భవిత కేంద్రం ఆధ్వర్యంలో మండల స్థాయి దివ్యాంగ పిల్లలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలను ఓపిక గా చూసుకోవాలని సూచించారు

ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం శిక్షకులు పెద్దోళ్ళ సృజన ఉపాధ్యాయులు పి.రాజశేఖర్, చెరుకు మహేశ్వర శర్మ, పుర్రె రమేష్ ,లక్కాడి రాజరెడ్డి ,వేల్పుల గంగారాజం



, యం.రవీందర్,జి. తరంగిణి, యస్. శోభ యం.రమ,బి.శాంతయ్య దివ్యాంగ పిల్లలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

# ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: సహాయ ఎన్నికల అధికారి అప్పాజీ

ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 27:

పుంగనూరు మండలంలో ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎవరైనా ఉల్లంఘించినట్లయితే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని సహాయ ఎన్నికల అధికారి అప్పాజీ మంగళవారం తెలిపారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నప్పుడు ఎవరైనా కానీ ఓటర్లకు నగదు, మద్యం, ఇతర బహుమతులు పంపిణీ చేయడం, కుల మతాలు పేరుతో ఓట్లు కోరడం, ఓటర్లను బెదిరించడం, అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు నిర్వహించడం, ప్రభుత్వ వాహనాలు, అధికార యంత్రాంగాన్ని ఎన్నికల ప్రచారానికి వినియోగించడం, పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేయడం నిషిద్ధమని సహాయ ఎన్నికల అధికారి అప్పాజీ తెలిపారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసేందుకు రిటర్నింగ్ అధికారి ఎస్. మజీద్ అహ్మద్ 9573817785, సహాయ రిటర్నింగ్ అధికారి ఎ. అప్పాజీ 9491071381, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ అధికారి జె. రాము 9491077070, ఎన్నికల వ్యయ నిర్వహణ, పరిశీలన



అధికారి ఎస్. ఇమ్రాన్ బాషా 9666883525 నంబర్లను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు, కృష్ణ యాదవ్ 7997524053, దొరస్వామి 9502898092, పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ ఎస్. అన్సర్ బాషా 9440900697 నంబర్లకు కూడా ఫిర్యాదు చేయవచ్చని అంబాజీ తెలిపారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు ప్రజలు ఎన్నికల నియమావళిని పాటించాలని, ఉల్లంఘనలకు సంబంధించిన వివరాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సహాయ ఎన్నికల అధికారి అప్పాజీ కోరారు

# జగిత్యాల మాజీ మునిసిపల్ చైర్పర్సన్ ఆడవాల జ్యోతి లక్ష్మణ్ నివాసంలో సత్యనారాయణ స్వామి పూజకు....



**-హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్పు ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు గజేంగి నందన్న**

ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 27:

జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ఆడవాల జ్యోతి లక్ష్మణ్ నివాసంలో ఈరోజు నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, ఆది శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు గజేంగి నందన్నలు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ప్రముఖులు శ్రీ సత్యనారాయణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆడవాల జ్యోతి లక్ష్మణ్ కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు ఆధ్యాత్మిక వాతావరణంలో కొంతసేపు గడిపారు.

ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# నిత్యావసరాలను తక్కువ ధరలకు అందించాలి

## మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో మొబైల్ వాహనాల ద్వారా ధరణి బ్రాండ్ బియ్యం

అమరావతి, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 27:

రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి, సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో సరుకులు అందించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. వివిధ నిత్యావసర వస్తువుల ధరలను వీలైనంత తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలను నియంత్రించే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. భవిష్యత్తులో నిత్యావసర వస్తువుల సరఫరా ప్రణాళికలపై చర్చించారు. పౌరసరఫరాల శాఖతో పాటు... వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో జరిపిన సమీక్షలో ధరల నియంత్రణకు సంబంధించి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు బియ్యం, కందిపప్పు, పామాయిల్, గోధుమ పిండి వంటి నిత్యావసరాలను తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ధరణి బ్రాండ్ పేరుతో విక్రయిస్తున్న సూపర్ ఫైన్ బియ్యాన్ని రైతుబజార్లకే పరిమితం చేయకుండా మున్సిపాలిటీలు, మండల కేంద్రాలకు విస్తరించాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే ధరణి బియ్యాన్ని మొబైల్ వాహనాల ద్వారా ప్రజలకు చేరువ చేయాలని స్పష్టం చేశారు. ఫైన్, సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ.49, రూ.50కు విక్రయించాలన్నారు. ఇక బహిరంగ మార్కెట్టులో కూడా బియ్యం ధరలను అదుపులో ఉంచేందుకు సీఎం ఆదేశాలతో మిల్లర్లు, హోల్ సేల్ అసోసియేషన్ ప్రతినిధులతో చర్చిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వివిధ రకాల బియ్యం ధరలను తగ్గించి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావడానికి మిల్లర్లు, హోల్ సేల్ అసోసియేషన్ ప్రతినిధులు అంగీకరించినట్టు అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బీపీటీ రకం స్టీమ్ బియ్యాన్ని కిలో రూ.66కు, సాధారణ రకం స్టీమ్ బియ్యాన్ని కిలో రూ.47కు మించకుండా విక్రయిస్తామని మిల్లర్లు అంగీకరించారని చెప్పారు. ప్రస్తుతం మార్కెట్‌లో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో, ధరణి బ్రాండ్ ద్వారా తక్కువ ధరలకు నాణ్యమైన బియ్యాన్ని అందించడంతో పాటు, ఇతర



రకాల బియ్యం ధరలపైనా నియంత్రణ ఉండేలా చూడాలని సీఎం ఆదేశించారు. పొరుగు రాష్ట్రాలకు అక్రమంగా ధాన్యం తరలిపోకుండా అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు, టోల్‌గేట్ల వద్ద నిఘా పెంచాలని, ధాన్యం, బియ్యంపై మార్కెట్ సెస్సు భారాన్ని తగ్గించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.

**దీపావళి నాటికి రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాలు**

కందిపప్పు ధరలను తగ్గించేందుకు తీసుకున్న చర్యలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డుదారులకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నెలకు కిలో కందిపప్పును రూ.100కే అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.170 నుంచి రూ.200 వరకు పలుకుతున్న నేపథ్యంలో, ప్రభుత్వ జోక్యంతో ధరల భారాన్ని తగ్గించేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి సంబంధించి కేంద్రం నుంచి అవసరమైన సహాయాన్ని తీసుకోవాలని సీఎం నిర్దేశించారు. రేషన్ షాపుల ద్వారా కందిపప్పు సరఫరాకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. పామాయిల్ ధరలను తగ్గించి సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి చెప్పారు. రేషన్ డిపోల ద్వారా లీటరు పామాయిల్‌ను రూ.125కే అందించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. దీని కోసం అవసరమైన పామాయిల్‌ను టెండర్ల ద్వారా సేకరించి సరఫరా చేసే ప్రక్రియ చేపట్టాలన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వంటనూనెల ధరలు పెరిగిన నేపథ్యంలో, ప్రభుత్వ సరఫరా ద్వారా వినియోగదారులకు ఉపశమనం కలిగించాలని పేర్కొన్నారు. అదేవిధంగా గోధుమ పిండిని కూడా రేషన్ దుకాణాల ద్వారా కిలో రూ.25కే అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కందిపప్పు, పామాయిల్, గోధుమ పిండి వంటి నిత్యావసరాలను దీపావళి పండుగ నాటికి రేషన్ షాపుల ద్వారా అందించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టే అవకాశం**

ఉల్లి ధరల నియంత్రణపై అధికారులు తీసుకున్న చర్యలపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఉల్లి ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం ఇప్పటికే మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం ద్వారా రైతుబజార్లల్లో కిలో రూ.35కే విక్రయిస్తోన్నట్టు అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో మరో 800 మెట్రిక్ టన్నుల ఉల్లిని అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజలకు సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. వచ్చే కాలంలో కర్నూలు ప్రాంతం నుంచి ఉల్లి పంట మార్కెట్‌లోకి అందుబాటులో వస్తే సరఫరా పెరిగి ధరలు తగ్గే అవకాశం ఉందని వివరించారు. ఉల్లి ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న వినియోగదారులకు ఉపశమనం కలిగేలా సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని సీఎం సూచించారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన చోట ప్రభుత్వ జోక్యం ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ధరల నియంత్రణకై తీసుకుంటున్న ఈ చర్యలతో నెలకు సుమారు రూ. 100 కోట్ల భారం ప్రభుత్వంపై పడుతుందని అధికారులు సీఎంకు వివరించారు. ప్రభుత్వానికి భారమైనా సరే... ధరల పెరుగుదల నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించాలని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రజలకు నాణ్యమైన సరుకులు సరసమైన ధరలకు అందేలా సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని, ధరల నియంత్రణ చర్యల ప్రయోజనాలు నేరుగా వినియోగదారులకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, పౌర సరఫరాల శాఖ కార్యదర్శి కన్నబాబు సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తుఫాన్‌పై అప్రమత్తం.. ప్రజల ప్రాణ రక్షణే ప్రభుత్వ లక్ష్యం!

## 290 తుఫాన్ షెల్టర్లు ఏర్పాటు.. 84,396 మందికి సురక్షిత ఆశ్రయం

అమరావతి, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:

తుఫాన్ ప్రభావంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ప్రజల ప్రాణాలను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఎన్నికల పనుల్లో బిజీగా ఉన్నప్పటికీ తుఫాన్ సన్నద్ధతపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తుఫాన్ రెడ్ కేటగిరీలో ఉన్నప్పటికీ ప్రజలు భయాందోళనలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.తుఫాన్ సన్నద్ధతపై నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు తుఫాన్ ప్రభావం ఉండే అవకాశం ఉందన్నారు. పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి ఉత్తరాంధ్ర వరకు భారీ వర్షాలు, బలమైన గాలుల తీవ్రత ఎక్కువగా ఉండవచ్చని అంచనా వేశారు. కాకినాడ సమీపంలోని యానాం వద్ద తుఫాన్ తీరం దాటే అవకాశం ఉందని వివరించారు. ఉత్తరాంధ్రలో ఇప్పటికే వర్షాలు ప్రారంభమయ్యాయని, రాత్రి నుంచి మరుసటి రోజు వరకు తీరప్రాంతాల్లో వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

**భారీ వర్షాలపై హెచ్చరికలు**

కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి, మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ తదితర ప్రాంతాల్లో తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉండవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో అతిభారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు. శ్రీకాకుళంలో30 సెంటీమీటర్లు, పశ్చిమగోదావరిలో 28 సెంటీమీటర్లు, విశాఖపట్నంలో 23 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వివరించారు. అనేక ప్రాంతాల్లో 10 సెంటీమీటర్లకు పైగా వర్షం కురిసే ప్రమాదం ఉందన్నారు. తీరప్రాంత జిల్లాల్లో సముద్రపు నీరు లోతట్టు ప్రాంతాల్లోకి చొచ్చుకొచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. నాగావళి, వంశధార నదులకు వరదలు వచ్చే ప్రమాదం ఉందని, వాగులు, వంకల్లో నీటి ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. చెరువులకు గండ్లు పడితే వెంటనే మరమ్మతులు చేపట్టేలా చర్యలు సిద్ధం చేశామన్నారు.

**84 వేల మందికి సురక్షిత ఆశ్రయం**

తుఫాన్ ముప్పును దృష్టిలో పెట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా 290 తుఫాన్ షెల్టర్లను ఏర్పాటు చేసినట్లు చంద్రబాబు వెల్లడించారు. ఇప్పటివరకు 84,396 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. సముద్ర తీర గ్రామాలు, లంకలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు తుఫాన్



షెల్టర్లకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితులు మినహా ప్రయాణాలు రద్దు చేసుకుని ఇళ్లలో లేదా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు 24 గంటల పాటు పనిచేస్తున్నాయని, ప్రతి గంటకు తుఫాన్ హెచ్చరికల బులెటిన్లు జారీ చేస్తున్నామని తెలిపారు. ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. తుఫాన్ తీవ్రతను అంచనా వేస్తూ కలెక్టర్లతో క్షేత్రస్థాయిలో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తామని చెప్పారు.

మత్స్యకారులు, గర్భిణుల భద్రతకు ప్రత్యేక చర్యలు

సముద్రంలో ఉన్న మత్స్యకారులకు చెందిన 30 వేలకుపైగా బోట్లను వెనక్కి రప్పించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. గోపాల్‌పూర్‌లో ఏపీకి చెందిన 93 బోట్లు, వాటి సిబ్బంది సురక్షితంగా ఉన్నారని వెల్లడించారు. అత్యవసర వైద్య సేవల కోసం 1,316 అంబులెన్సులను సిద్ధం చేశామని, సుమారు 5 వేల మంది గర్భిణులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, సమీప ఆస్పత్రులకు తరలించినట్లు చెప్పారు. తాగునీటి సరఫరాకు ట్యాంకర్లు, జనరేటర్లను సిద్ధం చేశామని, విద్యుత్ అంతరాయాలను వెంటనే పునరుద్ధరించేందుకు 8,400 మంది సిబ్బందిని అందుబాటులో ఉంచామని వివరించారు. తుఫాన్ కారణంగా సుమారు 15 వేల విద్యుత్ స్తంభాలు పడిపోయే అవకాశం ఉందని అంచనా వేసి, అందుకు అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

పంట నష్టంపై అంచనా.. డ్రోన్లతో సహాయక చర్యలు

తుఫాన్ కారణంగా సుమారు 7.16 లక్షల హెక్టార్ల వ్యవసాయ పంటలు, 16 లక్షల హెక్టార్ల ఉద్యాన పంటలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. నష్టాన్ని తగ్గించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని చెప్పారు. ముంపు గ్రామాలకు ఆహారం, ఔషధాలు చేరవేసేందుకు డ్రోన్లను ఉపయోగించేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. అంగన్‌వాడీల ద్వారా పిల్లలు, బాలింతలకు అవసరమైన సరుకులు అందించడంతో పాటు, రేషన్ సరఫరాకు కూడా చర్యలు తీసుకున్నామని తెలిపారు. క్యాచ్‌మెంట్ ప్రాంతాల్లో కురిసే వర్షపు నీటిని రిజర్వాయర్లలో నిల్వ చేసుకునేలా ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు.

గత అనుభవాలతో ముందస్తు కార్యాచరణ

గతంలో బుడమేరు వరదల సమయంలో విజయవాడ కలెక్టరేట్‌లోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించిన విషయాన్ని చంద్రబాబు గుర్తుచేశారు. ఆ సమయంలో ప్రజలు సుమారు రూ.500 కోట్ల మేర విరాళాలు అందించారని తెలిపారు. ప్రస్తుతం కూడా తుఫాన్ ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి, నష్టాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు నౌకాదళం, కోస్ట్‌గార్డులను అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. హుద్‌హుద్ తుఫాన్‌తో పోలిస్తే ప్రస్తుత తుఫాన్ తీవ్రత తక్కువగా ఉండవచ్చని అంచనా వేస్తున్నప్పటికీ, ప్రజలు నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు.

ప్రజలకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి:

తీరప్రాంత, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వరద నీటి ప్రవాహాల వైపు వెళ్లకూడదు. అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలి. ప్రాణ, ఆస్తి నష్టాన్ని వీలైనంత తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చంద్రబాబు స్పష్టం చేశారు.

# బల్మూర్ మండల కేంద్రంలో పత్తి చేలకు వెళ్తున్న పిల్లలకు విముక్తి





ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 27:

పత్తి చేలకు తరలి వెళ్తున్న బడి బయటి పిల్లల అధికారులు విముక్తి కల్పించారు. వివరాల్లోకి వెళితే బల్మూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో ఇతర ప్రాంతాల నుండి బుల్లోరా, ఆటో ,ట్రాక్టర్ , వాహనాలలో 22 మంది పిల్లలు పత్తి చేలకు వెళ్తున్న వారిని విముక్తి కల్పించడం జరిగింది. విద్యాశాఖ, పోలీస్ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్, స్వచ్ఛంద సంస్థ కోనేరు, ఆధ్వర్యంలో సంయుక్తంగా వివిధ ప్రాంతాలు లింగాల, క్యాంపు రాయవరం, దారారం, బల్మూర్, ప్రాంతాల పిల్లలను విముక్తి కల్పించి వారిని వారి వారి పాఠశాలలకు తిరిగి పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మల్లేష్, పోలీస్ శాఖ పిసి ప్రసాద్, కోనేరు స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఏరియా కోఆర్డినేటర్లు జాకీర్ హుస్సేన్ శ్రీనివాసులు శివుడు, సర్పంచి భర్త మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి సంక్షేమమే టిడిపి లక్ష్యం.





ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 27:

గ్రామాల అభివృద్ధి సంక్షేమమే ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనే తెలుగుదేశం పార్టీ ప్రధాన లక్ష్యమని దోమాడ ఎంపీటీసీ అభ్యర్థి సవరపు చిట్టిబాబు గ్రామ టిడిపి నాయకులు సీనియర్ నాయకులు మద్దుకూరి దొరబ్బాయి పేర్కొన్నారు. దొమాడ గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా పెదపూడి మండలం దోమాడ, కైకవాలు గ్రామ ఎంపిటిసి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సవరపు చిట్టిబాబు టిడిపి నాయకులు కార్యకర్తలతో గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రచార పత్రాలను పంపిణీ చేస్తూ తమ ఓటును సైకిల్ గుర్తుపై వేసి కూటమి అభ్యర్థులను బారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో దొరబ్బాయి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇంతవరకు గ్రామంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు దోమాడ గ్రామ నాయకత్వానికి మద్దతుగా దోమాడ గ్రామ యువత ముందుకు వచ్చి ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గుణ్ణం వెంకటేశ్వరరావు కొప్పోజు సత్తిబాబు యర్రా శ్రీనివాస్, ( నల్లయ్య) జుత్తుక గోవిందు సవరపు సుబ్బయ్య రాయుడు సాయిబాబు పాలచర్ల వెంకటరావు వల్లూరి సత్యనారాయణ సింగవరపు గోవిందు యార్లగడ్డ సత్యనారాయణ వల్లూరి లచ్చన్న కొప్పోజు మణికంఠ తదితరులు పాల్గొన్నారు

## హెబ్రోన్ చర్చి వివాదంలో పోలీసుల తీరుపై ఖండించిన -క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరూషలేం మత్తయ్య

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
హెబ్రోన్ చర్చి అంతర్గత వివాదంలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ అమాయకులపై తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నారని క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరూషలేం మత్తయ్య ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగి కె. వెంకటేశ్వర్లు, పాస్టర్ బానోతు భీమా అలియాస్ బర్నబాస్‌ల అరెస్టుల తీరును ఆయన ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

చర్చి ఆస్తులు, కానుకల నిధుల వినియోగంపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో, రాగి వీరాచారి ఇచ్చిన ఫిర్యాదుపై సరైన విచారణ లేకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని మత్తయ్య ఆరోపించారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఆడియోలపై ఫోరెన్సిక్ విచారణ జరిపించాలని, హెబ్రోన్ చర్చి ఆస్తులు, నిధుల నిర్వహణకు ప్రభుత్వ పర్యవేక్షణలో కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి, అక్రమ అరెస్టులకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. హెబ్రోన్ చర్చి విశ్వాసులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## దేశవ్యాప్తంగా 1,265 స్టేషన్ మాస్టర్ పోస్టుల భర్తీకి రైల్వే నోటిఫికేషన్ ఏదైనా డిగ్రీ పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు

**ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ నవంబర్ 25**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
స్టేషన్ మాస్టర్ పోస్టుల భర్తీకి భారతీయ రైల్వే ఆన్‌లైన్ దరఖాస్తులను ప్రారంభించింది. సెంట్రలైజ్డ్ ఎంప్లాయ్‌మెంట్ నోటీసు (జజుచీ) నం. 08/2026 కిందదేశవ్యాప్తంగా1,265 ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.రైల్వే బోర్డు నిర్ణయం ప్రకారం, 2026 నుంచి స్టేషన్ మాస్టర్ పోస్టుల భర్తీకి ప్రత్యేకంగా నోటిఫికేషన్ జారీ చేస్తున్నారు. అర్హతలు, పరీక్షా విధానం, పోస్టుల పంపిణీ వివరాలను ఈ నోటిఫికేషన్‌లో పొందుపరిచారు.

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డుల వారీగా అత్యధికంగా ముంబై బోర్డులో 177 పోస్టులు ఉన్నాయి. జమ్మూ--శ్రీనగర్‌లో 122, చెన్నైలో 119 ఖాళీలను ప్రకటించారు. దేశంలోని వివిధ రైల్వే జోన్లలో ఈ ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉన్నాయి.

ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ అక్టోబర్ 27న ప్రారంభమైంది. నవంబర్ 25, 2026 దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ. అభ్యర్థులు దరఖాస్తు సమర్పించే ముందు అర్హతలు, పోస్టుల వివరాలు, దరఖాస్తు సూచనలను నోటిఫికేషన్‌లో పరిశీలించాలని రైల్వే సూచించింది.

## రాష్ట్రాల పారిశ్రామికోత్పత్తి సూచీ ప్రాతిపదిక సవరణపై వర్క్‌షాప్ అక్టోబర్ 28 నుంచి 30 వరకు తిరువనంతపురంలో నిర్వహణ

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
రాష్ట్రస్థాయి పారిశ్రామికోత్పత్తి సూచీ (IIP) ప్రాతిపదిక సంవత్సర సవరణపై మూడు రోజుల వర్క్‌షాప్ కేరళలోని తిరువనంతపురంలో అక్టోబర్ 28 నుంచి 30 వరకు జరగనుంది. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (MoSPI), కేరళ ఆర్థిక, గణాంకాల శాఖ (ణజూ) సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

పారిశ్రామిక రంగ పనితీరులో మార్పులను అంచనా వేసే కీలక సూచీ IIP. పారిశ్రామిక కార్యకలాపాల ధోరణులను తెలుసుకోవడానికి, విధాన నిర్ణయాలకు, ఆర్థిక వృద్ధి అంచనాలకు విధానకర్తలు, ఆర్థికవేత్తలు, వ్యాపార సంస్థలు, పెట్టుబడిదారులు ఈ సూచీని వినియోగిస్తారు.

అఖిల భారత IIP ప్రాతిపదిక సంవత్సరాన్ని 2011--12 నుంచి 2022--23కు వీశ్రూ× ఇప్పటికే మార్చింది. ఉత్పత్తిలో వచ్చే మార్పులను పోల్చేందుకు ప్రాతిపదిక సంవత్సరం ఆధారంగా ఉంటుంది. ప్రస్తుత పారిశ్రామిక ఉత్పత్తి స్వరూపాన్ని సూచీలో మరింత సముచితంగా ప్రతిబింబించేందుకు తాజా ప్రాతిపదిక సంవత్సరం ఉపయోగపడుతుంది.

సవరించిన సూచీలో వస్తువుల బాస్కెట్, వాటాల పునఃపరిశీలన, కర్మాగారాల జాబితా నవీకరణ, గ్యాస్ సరఫరా, నీటి సరఫరా, మురుగునీటి పారుదల, వ్యర్థాల నిర్వహణ కార్యకలాపాలను చేర్చడం, కర్మాగారాల స్థానంలో ప్రత్యామ్నాయాలను తీసుకునే విధానం వంటి మార్పులు ఉన్నాయి.

రాష్ట్రాల స్థాయి IIP" రూపొందించి, ప్రచురించే బాధ్యత ఆయా రాష్ట్రాల ఆర్థిక, గణాంకాల శాఖలది. జాతీయ స్థాయిలో నోడల్ మంత్రిత్వ శాఖగా MoSPI, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సాంకేతిక మార్గదర్శకత్వం అందిస్తూ, పారిశ్రామిక గణాంకాల్లో ఏకరీతి, నాణ్యత, పోలికలను పెంపొందిస్తోంది.

వర్క్‌షాప్‌లో సవరించిన IIP నిర్మాణం, పద్ధతులపై రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అధికారులకు అవగాహన కల్పించనున్నారు. సూచీలో ట్రాక్ చేయాల్సిన వస్తువులు, సమాచారం అందించే కర్మాగారాల జాబితాను ఖరారు చేసేందుకు చర్చలు జరగనున్నాయి. జాతీయ పారిశ్రామిక వర్గీకరణ--2025, జాతీయ ఉత్పత్తి వర్గీకరణలో ప్రతిపాదించిన మార్పులపై అభిప్రాయాలు పంచుకునేందుకు కూడా ఈ సమావేశం వేదిక కానుంది.

MoSPI, వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల గణాంక శాఖలకు చెందిన సుమారు 60 మంది అధికారులు వర్క్‌షాప్‌లో పాల్గొననున్నారు. దేశవ్యాప్తంగా పారిశ్రామిక గణాంకాల నాణ్యత, స్థిరత్వం, పోలికలను బలోపేతం చేయడం ఈ కార్యక్రమం లక్ష్యమని మంత్రిత్వ శాఖ తెలిపింది.

## సనత్ నగర్ నియోజకవర్గం పద్మారావు నగర్ డివిజన్ లో పట్టభద్రుల ఎం ఎల్ సి ఓటర్ నమోదు కార్యక్రమం



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
సనత్ నగర్ నియోజకవర్గం పద్మారావు నగర్ డివిజన్, డాక్టర్ కోట నీలిమ ఆదేశాల మేరకు, ఎంపీ సునీల్, పద్మారావు నగర్ డివిజన్ ఆస్పిరెంట్ మెరుగు జగదీశ్వర్, పద్మారావు నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్ నగర్ జిల్లాల పట్టభద్రుల ఎం ఎల్ సి ఎన్నికల ఓటర్ నమోదు కార్యక్రమం పద్మారావు నగర్ డివిజన్ సర్దార్ పటేల్ కాలేజ్ వద్ద నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సనత్ నగర్ నియోజకవర్గం ఇంచార్జ్ ఽ టీ పి సి సి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కోట నీలిమ గారి నేతృత్వంలో ఎం ఎల్ సి పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమంలో భారీ సంఖ్యలో పట్టభద్రులు ఓటర్ నమోదు చేసుకోవడం జరిగింది.

ఈ సందర్భంగా పట్టభద్రులతో మాట్లాడుతూ --- ఓటు నమోదు చేసుకొని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించవలసిందిగా పట్టభద్రులకు విజ్ఞప్తి చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యాదవ్ చారి, తోటా రామకృష్ణ, వేద ప్రకాష్ యాదవ్, వై.ఎం. విజయ్ కుమార్, కృపా ప్రసాద్, లవ, సుధారాణి, నాగరాణి, మావిడాల బాలకృష్ణ, దినేష్ కుమార్, మహేష్, సిహెచ్ శివకుమార్, కల్పన, వీరస్వామి, ప్రవీణ్ చారి, ఆనంద్ కొంద్ర, రమేష్

## స్టార్టప్‌లకు ప్రోత్సాహం.. వ్యాపార నిబంధనల్లో భారీ సంస్కరణలు

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
అనుమతుల ఆధారిత విధానం నుంచి విశ్వాస ఆధారిత పాలన వైపు భారత్ అడుగులు వేస్తోందని పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ (డీపీఐఐటీ) తెలిపింది. స్టార్టప్‌లకు మద్దతు, నిబంధనల సరళీకరణ, విదేశీ పెట్టుబడులకు ప్రోత్సాహం, డిజిటల్ సింగిల్ విండో అనుమతుల ద్వారా వ్యాపారాలపై నియంత్రణ భారాన్ని తగ్గిస్తున్నట్లు పేర్కొంది.స్టార్టప్ ఇండియా కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా 770కి పైగా జిల్లాల్లో 2,50,046 స్టార్టప్‌లకు గుర్తింపు లభించింది. ఈ సంస్థలు 25.42 లక్షలకు పైగా ఉద్యోగాలను కల్పించాయి. గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో 52 శాతం మెట్రో నగరాల వెలుపలివి కాగా, 48 శాతం సంస్థల్లో కనీసం ఒక మహిళా డైరెక్టర్ ఉన్నారు. 2023--24లో 34,200గా ఉన్న వార్షిక గుర్తింపులు 2024--25లో 36,440కు పెరిగాయి.స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ పథకం కింద 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 244 ఇంక్యుబేటర్ల ద్వారా 4,194 స్టార్టప్‌లకు రూ.775.67 కోట్లు ఆమోదించారు. వీటిలో మహిళలు నాయకత్వం వహిస్తున్న స్టార్టప్‌లు 2,147 కాగా, టైర్--2, టైర్--3 నగరాలకు చెందినవి 2,356 ఉన్నాయి. స్టార్టప్‌ల కోసం నిధుల నిధి పథకం కింద సిడ్బీ 166 ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధులకు రూ.12,623 కోట్లు కేటాయించింది. ఆ నిధులు 1,475 స్టార్టప్‌లలో రూ.28,254 కోట్లు పెట్టుబడి పెట్టాయి.స్టార్టప్‌ల క్రెడిట్ గ్యారంటీ పథకం కింద 532 రుణాలకు రూ.1,662.71 కోట్ల హామీ కల్పించారు. ఈ రుణాలు 41,637 మందికి ఉపాధి కల్పిస్తున్న స్టార్టప్‌లకు అందాయి. ఒక్కో రుణగ్రహీతకు గ్యారంటీ పరిమితిని రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్లకు పెంచగా, 27 ప్రాధాన్య రంగాలకు వార్షిక రుసుమును 1 శాతానికి తగ్గించారు.

స్టార్టప్ రంగంలో 63 నియంత్రణ సంస్కరణలు చేపట్టారు. ఏంజెల్ పన్ను రద్దు, లిస్టెడ్, అన్‌లిస్టెడ్ షేర్లపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను విధానాల సమన్వయం, బీమా సంస్థలు, ఈపీఎఫ్ఓ, సూపర్‌యాన్యుయేషన్, గ్రాట్యుటీ నిధులు ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధుల్లో పెట్టుబడి పెట్టేందుకు అనుమతి వంటివి వీటిలో ఉన్నాయి. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80-ఐఏసీ కింద 4,467 స్టార్టప్‌లకు అర్హత ధ్రువీకరణ లభించింది.

ప్రభుత్వ ఈ-మార్కెట్‌ప్లేస్ (జీఈఎం)లో నమోదు చేసుకున్న స్టార్టప్‌ల సంఖ్య 2021 జనవరిలో 7,929 ఉండగా, ప్రస్తుతం 43,260కు చేరింది. గత అనుభవం, కనీస టర్నోవర్, ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ నిబంధనల్లో సడలింపులు ఇందుకు దోహదపడ్డాయి. ఈ స్టార్టప్‌లు ప్రభుత్వ కొనుగోలుదారులకు 6.23 లక్షల ఆర్డర్లు అందించి, రూ.68,105 కోట్ల విలువైన వ్యాపారం చేశాయి. స్టార్టప్ విధానాలు అమలు చేస్తున్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సంఖ్య 2016లో నాలుగు ఉండగా, ప్రస్తుతం 32కు పెరిగింది. 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 104 ఇంక్యుబేటర్లు ఏర్పాటు కాగా, తేజస్ కార్యక్రమం 27 రాష్ట్రాల్లోని 132 జిల్లాలకు విస్తరించింది.

వ్యాపార నిబంధనల సరళీకరణలో భాగంగా కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మొత్తం 47,957 అనుసరణల భారాన్ని తగ్గించారు. వాటిలో 22,290ను డిజిటలైజ్ చేయగా, 16,141ను సరళీకరించారు, 5,255ను నేర పరిధి నుంచి తొలగించారు, 4,271ను పూర్తిగా రద్దు చేశారు. జన విశ్వాస్ చట్టాల ద్వారా కేంద్ర చట్టాల్లోని 900 నిబంధనలను నేరరహితం చేశారు. 2023లో 42 చట్టాల్లోని 183 నిబంధనలను, 2026లో 79 చట్టాల్లోని 717 నిబంధనలను ఈ పరిధిలోకి తీసుకొచ్చారు.

వ్యాపార సంస్కరణల కార్యాచరణ ప్రణాళికలోని ఏడు దశల ద్వారా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు 9,700కు పైగా సంస్కరణలను అమలు చేశాయి. జిల్లా స్థాయి సంస్కరణల ప్రణాళికలో కలెక్టరేట్లు, అభివృద్ధి సంస్థలు, పట్టణ స్థానిక సంస్థల కోసం 222 సంస్కరణలు చేర్చారు.

29 కేంద్ర కార్మిక చట్టాలను నాలుగు కార్మిక కోడ్‌లుగా ఏకీకృతం చేశారు. తొలగింపు లేదా సంస్థ మూసివేతకు ముందస్తు అనుమతి అవసరమయ్యే కార్మికుల పరిమితిని 100 నుంచి 300కు పెంచారు. విద్యుత్ వినియోగించే కర్మాగారాల్లో కార్మికుల పరిమితిని 10 నుంచి 20కు, విద్యుత్ వినియోగించని కర్మాగారాల్లో 20 నుంచి 40కు పెంచారు. కాంట్రాక్టు కార్మికుల లైసెన్సింగ్ పరిమితిని 20 నుంచి 50కు చేర్చారు. చట్టపరమైన చర్యలకు ముందు 30 రోజుల అనుసరణ నోటీసు ఇవ్వడం తప్పనిసరి చేశారు.

పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ (పెసో) జారీ చేసే లైసెన్సుల చెల్లుబాటు గడువును ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచారు. పెసో సేవలన్నింటినీ డిజిటలైజ్ చేసి జాతీయ సింగిల్ విండో వ్యవస్థతో అనుసంధానించారు. జిల్లా అధికారుల నుంచి అభ్యంతరం లేదని తెలిపే ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో జారీ చేసే విధానం ప్రవేశపెట్టారు. మహిళలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రుసుముల్లో రాయితీలు కల్పించారు. వలస పాలన కాలం నాటి 1923 బాయిలర్స్ చట్టం స్థానంలో 2025 బాయిలర్స్ చట్టాన్ని తీసుకొచ్చారు.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) రంగంలో 17 విభాగాలను ఆటోమేటిక్ మార్గంలోకి తీసుకొచ్చారు. కొత్త పారిశ్రామిక లైసెన్సులున్న రక్షణ రంగ సంస్థల్లో ఆటోమేటిక్ మార్గం కింద ఎఫ్‌డీఐ పరిమితిని 49 నుంచి 74 శాతానికి పెంచారు. బీమా రంగంలో 2021లో పరిమితిని 49 నుంచి 74 శాతానికి పెంచగా, 2026లో తమ మొత్తం ప్రీమియాన్ని భారత్‌లోనే పెట్టుబడి పెట్టే బీమా సంస్థలకు 100 శాతం ఎఫ్‌డీఐకి అనుమతించారు. 2021--22 నుంచి 2024--25 వరకు బీమా రంగం సుమారు 8.79 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించింది. టెలికమ్యూనికేషన్లు, నాన్-షెడ్యూల్డ్ విమాన సేవలు, విమానాశ్రయ గ్రౌండ్ హ్యాండ్లింగ్, ఉపగ్రహ విడిభాగాల తయారీ, ప్రసార పంపిణీ రంగాల్లో ఆటోమేటిక్ మార్గం ద్వారా 100 శాతం ఎఫ్‌డీఐకి అనుమతి ఉంది.

2014--15 నుంచి 2025--26 వరకు భారత్‌కు 843 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐ వచ్చింది. అంతకుముందు 12 ఏళ్లలో వచ్చిన 313 బిలియన్ డాలర్లతో పోలిస్తే ఇది 169 శాతం అధికం. 2025--26లో ఎఫ్‌డీఐ ప్రవాహం రికార్డు స్థాయిలో 94.53 బిలియన్ డాలర్లకు చేరింది.

జాతీయ సింగిల్ విండో వ్యవస్థ (ఎన్ఎస్‌డబ్ల్యూఎస్) ద్వారా ఇప్పటివరకు 15,49,850 దరఖాస్తులు అందగా, 5,76,778 వ్యాపార సంస్థలు నమోదు చేసుకున్నాయి. 8.5 లక్షలకు పైగా అనుమతులు జారీ చేశారు. ఈ వేదికపై 327 కేంద్ర సేవలు, 3,452 రాష్ట్ర సేవలు కలిపి మొత్తం 3,779 సేవలు అందుబాటులో ఉన్నాయి. 34 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, 32 కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలను వ్యవస్థతో అనుసంధానించారు.

'నో యువర్ అప్రూవల్స్' (కేవైఏ) మాడ్యూల్ ద్వారా వ్యాపారాలకు వర్తించే 8,000కు పైగా అనుమతులపై సమాచారం అందిస్తున్నారు. వీటిలో 592 కేంద్ర, 2,233 రాష్ట్ర అనుమతులు కలిపి 2,825 అనుమతులు వ్యవస్థలో అనుసంధానమయ్యాయి. 285 అనుమతుల కోసం అవసరమైన 89 సాధారణ సమాచార వివరాలు ఆటోమేటిక్‌గా నింపే సదుపాయం కల్పించారు. పోర్టల్ 22 భారతీయ భాషల్లో అందుబాటులో ఉంది.

అనుమతుల ప్రక్రియను మరింత సరళీకరించేందుకు పరిశ్రమల పారిశ్రామికవేత్తల మెమొరాండం (ఐఈఎం)ను కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, జీఎస్‌టీఎన్ తదితర డేటాబేస్‌ల నుంచి వివరాలు సేకరించి ఆటోమేటిక్‌గా రూపొందిస్తున్నారు. దీనికి ప్రత్యేక విభాగం అనుమతి అవసరం లేదు. విదేశీ నిపుణుల కోసం ఈ-బీ4 ప్రొడక్షన్ వీసా స్పాన్సర్‌షిప్ లేఖలను కూడా ఎన్ఎస్‌డబ్ల్యూఎస్, వీసా పోర్టల్ అనుసంధానం ద్వారా రూపొందిస్తున్నారు.

డిజిటల్ విధానాలు, సులభతర నిబంధనలు, సింగిల్ విండో సేవలతో వ్యాపారాల స్థాపన, విస్తరణ, పెట్టుబడులకు అవసరమైన ప్రక్రియలను సరళీకరించడం, భౌతిక సంప్రదింపులను తగ్గించడం, పారదర్శకత పెంచడం, సేవలను నిర్ణీత గడువులో అందించడం ప్రభుత్వ సంస్కరణల లక్ష్యమని డీపీఐఐటీ పేర్కొంది.

## భారత్--నెదర్లాండ్స్ వాణిజ్య, పెట్టుబడి సంబంధాల బలోపేతంపై పీయూష్ గోయల్ చర్చలు

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
నెదర్లాండ్స్ పర్యటనలో భాగంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అక్టోబర్ 26న ఆ దేశ ప్రభుత్వ నేతలు, పార్లమెంటు సభ్యులు, ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించారు. భారత్--నెదర్లాండ్స్ ఆర్థిక సహకారాన్ని విస్తరించడం, వాణిజ్యం, పెట్టుబడులకు కొత్త అవకాశాలను గుర్తించడం ఈ చర్చల ప్రధాన ఉద్దేశం.




నెదర్లాండ్స్ విదేశీ వాణిజ్యం, అభివృద్ధి సహకార శాఖ మంత్రి ష్యోర్డ్ ష్యోర్డ్‌స్మా, ఆర్థిక వ్యవహారాలు, వాతావరణ శాఖ మంత్రి హీలెన్ హెర్బర్ట్, ఉత్తర హాలండ్ ప్రావిన్స్ కింగ్స్ కమిషనర్ ఆర్థర్ వాన్ డైక్‌తో పీయూష్ గోయల్ సమావేశమయ్యారు. ఆ దేశ దిగువ సభ విదేశీ వాణిజ్యం, అభివృద్ధి సహకార కమిటీ, సెనెట్ యూరోపియన్ వ్యవహారాల కమిటీ సభ్యులతోనూ చర్చించారు. ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలు, వాణిజ్యం, పెట్టుబడులు, భారత్--యూరోపియన్ యూనియన్ ఆర్థిక భాగస్వామ్యంపై అభిప్రాయాలు పంచుకున్నారు.

భారత్--నెదర్లాండ్స్ బిజినెస్ ఫోరమ్‌కు పీయూష్ గోయల్, నెదర్లాండ్స్ మంత్రి ష్యోర్డ్ ష్యోర్డ్‌స్మా సంయుక్తంగా అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో భారత, డచ్ వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులతో కలిపి సుమారు 200 మంది పాల్గొన్నారు. భారత్--ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ద్వారా లభించే అవకాశాలు, మార్కెట్ ప్రవేశం, పెట్టుబడి భాగస్వామ్యాలు, కీలక రంగాల్లో సహకారంపై చర్చించారు. ఇరు దేశాల పరిశ్రమల మధ్య మరింత ప్రత్యక్ష భాగస్వామ్యంతో వ్యాపార ఒప్పందాలు, పెట్టుబడులు, భారత్--యూరప్ సరఫరా గొలుసుల అనుసంధానాన్ని బలోపేతం చేయాలని అభిప్రాయపడ్డారు. సెమీకండక్టర్ సాంకేతికత, ఎలక్ట్రానిక్స్, లాజిస్టిక్స్, ఇంధనం, పారిశ్రామిక పరిష్కారాలు, సాంకేతికత, రిటైల్ రంగాలకు చెందిన డచ్ కంపెనీల ముఖ్య కార్యనిర్వాహకులతో మంత్రి విడివిడిగా సమావేశమై వ్యాపార ప్రాధాన్యాలు, సహకార అవకాశాలపై చర్చించారు. భారత రాయబార కార్యాలయం, హెచ్ఎస్‌బీసీ నెదర్లాండ్స్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో 15 డచ్ కంపెనీల సీనియర్ కార్యనిర్వాహకులతో రౌండ్‌టేబుల్ సమావేశంలోనూ పాల్గొన్నారు. భారత్‌లో పెట్టుబడులు, వాణిజ్య భాగస్వామ్యాలు, ప్రైవేటు రంగాల మధ్య సహకార విస్తరణపై చర్చలు జరిగాయి.

భారత్--నెదర్లాండ్స్ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచడం, భారత్--ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడంతో ఆర్థిక సంబంధాల్లో కొత్త ఊపు వచ్చిందని మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ పీయూష్ గోయల్ పేర్కొన్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక భాగస్వామ్యాల విస్తరణకు అపార అవకాశాలున్నాయని, యూరప్ మార్కెట్లకు నెదర్లాండ్స్ కీలక ద్వారంగా నిలుస్తుందని ఆయన తెలిపారు. భారత ఆర్థిక వృద్ధి, పెట్టుబడి అవకాశాలను ప్రస్తావిస్తూ నెదర్లాండ్స్, యూరోపియన్ యూనియన్‌తో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు భారత్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## ఎల్‌నినో, కరువు పరిస్థితులపై నేడే అఖిలపక్ష భేటీ భట్టి విక్రమార్క అధ్యక్షతన సమావేశం.. కరువు నివారణ చర్యలపై చర్చ

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, కరువు పరిస్థితులపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించనుంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆరో అంతస్తులోని గది నంబర్ 33లో ఈ సమావేశం జరగనుంది. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, వర్షపాతం లోటు నేపథ్యంలో ప్రజలు, రైతులపై పడే



ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించనున్నారు. తాగునీటి సరఫరా, నీటి వనరుల పరిరక్షణ, సాగునీటికి విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక వంటి కీలక అంశాలపై రాజకీయ పార్టీల నేతల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించనున్నారు. కరువు నివారణకు అనుసరించాల్సిన వ్యూహాలు, అవసరమైన ముందస్తు చర్యలపై అఖిలపక్ష నేతల అభిప్రాయాలను ప్రభుత్వం తెలుసుకోనుంది. రాష్ట్రంలో కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ప్రభుత్వం కోరనుంది.

# రైతులు సంఘటితమైతేనే మంచి ధర, మార్కెట్ సౌకర్యం: 'రైతు నేస్తం'లో రైతు సంఘాలకు ప్రత్యేక అవగాహన

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**

పంట పండించడం ఒక ఎత్తయితే, పండిన పంటను మంచి ధరకు అమ్ముకోవడం మరో ఎత్తు. ఒక్కడిగా మార్కెటింగ్ చేసుకునే రైతుకు మంచి ధర, మెరుగైన మార్కెట్ సౌకర్యాలు, పంటకు డిమాండ్ దొరకడం కష్టమవుతోంది. రైతులంతా కలిసి రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా (ఫీూాలు) ఏర్పడినా, మహిళా స్వయం సహాయక సంఘాలు (ూఎ+లు), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ూాజూ) సభ్యులుగా చేరినా ఈ ఇబ్బందులు తగ్గుతాయని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. సంఘటితంగా ఉంటే పంటకు డిమాండ్ పెరగడంతో పాటు మంచి ధర కూడా దక్కుతుందని తెలిపింది.

ఈ సంఘాల్లోని రైతులకు తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా వారి కోసమే 'రైతు నేస్తం' 112వ ఎపిసోడ్‌ను మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేకంగా నిర్వహించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటైంది. వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్ ఁవ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, ఐ.ఏ.ఎస్. ముఖ్య అతిథిగా పాల్గొని, రైతు ఉత్పత్తిదారుల సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

**రైతు సంఘాల బలోపేతమే లక్ష్యం**

కార్యక్రమంలో ప్రసంగించిన వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి, ఐ.ఏ.ఎస్. మాట్లాడుతూ, రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని



చెప్పారు. అందులో భాగంగానే ఈ రోజు 'రైతు నేస్తం' ప్రత్యేక కార్యక్రమాన్ని వీరి కోసమే నిర్వహించామని తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి, చిన్న, సన్నకారు రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా వ్యవసాయ శాఖ పనిచేస్తోందన్నారు. పథకాల లబ్ధిదారుల ఎంపికలో క్షేత్రస్థాయి అధికారులు ఈ సంఘాలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని ఆయన సూచించారు.

**అద్దెకు యంత్రాలు: కస్టమ్ హైరింగ్ సెంటర్లు**

వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా కస్టమ్ హైరింగ్ సెంటర్లను (జఎజ) ఏర్పాటు చేస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులు ప్రతి యంత్రాన్నీ కొనుక్కోలేరు. అందుకే FPO\T, SHG\T, PACS ద్వారా ఈ కేంద్రాలు ఏర్పాటవుతాయి. యంత్రాలను అద్దెకు ఇవ్వడం వల్ల ఆ సంఘాలకు ఆదాయం వస్తుంది, చిన్న రైతులకు ఖర్చు తగ్గుతుంది. భూమి అభివృద్ధి, విత్తనం--నాటడం, అంతరకృషి, సస్యరక్షణ, కోత--నూర్పిడి, కోత అనంతర పనులు, పంట అవశేషాల నిర్వహణ అనే ఏడు విభాగాల్లో 37 రకాల యంత్రాలు ఈ కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయి. వీటిలో పవర్ టిల్లర్, రోటోవేటర్, విత్తన--ఎరువు డ్రిల్, పవర్ స్ప్రేయర్లు, కిసాన్ డ్రోన్, కంబైన్ హార్వెస్టర్, పసుపు బాయిలర్, పాలిషర్, స్ట్రా బేలర్ ఉన్నాయి. దీనివల్ల కూలీల కొరత తగ్గి, ఖర్చు, సమయం ఆదా అవుతాయి. పథకం నియమాలు, ఆన్‌లైన్ దరఖాస్తు విధానం, రైతులు నేరుగా పొందే ప్రయోజనాలను వ్యవసాయ కమిషనరేట్ అధికారులు వివరించారు.

ఎల్‌నినో జాగ్రత్తలు, నేల సంరక్షణ

ఎల్‌నినో నేపథ్యంలో అమలు చేయాల్సిన ప్రత్యామ్నాయ (కాంటింజెన్సీ) ప్రణాళిక, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలు, రైతులకు ఇవ్వాల్సిన అవగాహనపై అధికారులు వివరించారు. 'ఖేత్ బచావో అభియాన్' అమలు తీరు, నేల సంరక్షణ లక్ష్యాలను కూడా విపులంగా చర్చించారు.

**ఎగుమతిదారులు, కొనుగోలుదారుల అనుభవాలు**

పంటలను పెద్ద ఎత్తున కొనే సంస్థలు, అగ్రిగేటర్లు, విలువ జోడించిన ఉత్పత్తులు తయారు చేసే కంపెనీలు, దేశీయంగా, విదేశాలకు ఎగుమతి చేస్తున్న సంస్థల ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులు, రైతు సంఘాలు, మహిళా సంఘాలు, సహకార సంఘాలు అధిక ఆదాయం ఎలా పొందవచ్చో వారు వివరించారు.

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ డివిజన్‌లోని కోహీర్ మండలంలో రైతులు 'గెర్కిన్స్' అనే ప్రత్యేక రకం కీరదోసను పండిస్తున్నారు. వాటిని విదేశాలకు ఎగుమతి చేస్తున్న కంపెనీ ప్రతినిధులు, స్వల్ప కాలంలో ఈ పంటను ఎలా సాగు చేయాలో, పంట తర్వాత విలువ జోడించిన ఉత్పత్తులుగా మార్చి ఇతర దేశాలకు ఎలా పంపుతున్నారో చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో మునగ ఆకులను సేకరించి, పొడిగా తయారుచేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్న కంపెనీ ప్రతినిధులు తమ అనుభవాలను రైతులతో పంచుకున్నారు.

**రబీ సాగుకు సూచనలు**

రబీ సీజన్‌లో పంటల ఎంపికపై కూడా వ్యవసాయ శాఖ రైతులకు సూచనలు చేసింది. నవంబర్ మొదటి పక్షం వరకు పప్పుధాన్యాలు, నూనెగింజలు విత్తుకోవచ్చు. నవంబర్ 16 తర్వాత పెసర, మినుము, జొన్న, పొద్దుతిరుగుడు, వేరుశనగ మాత్రమే అనుకూలం. నీటి లభ్యతను బట్టి పంటను ఎంచుకోవాలని, కుసుమ, శనగ, పెసర, మినుము తక్కువ నీటితో పండుతాయని, జొన్న, పొద్దుతిరుగుడు, వేరుశనగకు తగినంత నీరు అవసరమని తెలిపింది. పూత, కాయ నిండే దశల్లో తప్పనిసరిగా నీరు అందించాలని, సిఫారసు చేసిన రకాలనే అధికారిక డీలర్ల నుంచి కొనుగోలు చేయాలని సూచించింది. రైతులు సంఘాలుగా ఏర్పడి, ప్రభుత్వ పథకాలను, మార్కెటింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ కోరింది.

## నవంబర్ 1 నుంచి 15 వరకు దేశవ్యాప్తంగా జనజాతీయ గౌరవ పఖ్వాడా

## బిర్సా ముండా జయంతి సందర్భంగా 300కు పైగా ప్రాజెక్టులు, రెండు జాతీయ డిజిటల్ కార్యక్రమాలు ప్రారంభం

**19 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 160కి పైగా కార్యక్రమాలు**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**

ధర్తీ ఆబా భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా నవంబర్ 1 నుంచి 15 వరకు దేశవ్యాప్తంగా జనజాతీయ గౌరవ పఖ్వాడాను నిర్వహించనున్నట్లు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. నవంబర్ 15న జనజాతీయ గౌరవ దివస్‌తో పక్షోత్సవాలు ముగుస్తాయి.

గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల సేవలను స్మరించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను గిరిజన కుటుంబాలకు చేరువ చేయడం, పథకాలు, హక్కులపై గిరిజన సమాజాలు, విద్యార్థులు, ప్రజల్లో అవగాహన పెంచడం ఈ కార్యక్రమాల లక్ష్యం. పక్షోత్సవాల సందర్భంగా 300కు పైగా ప్రాజెక్టులు, రెండు జాతీయ డిజిటల్ కార్యక్రమాలు, రాష్ట్రస్థాయిలో 160కి పైగా కార్యకలాపాలు చేపట్టనున్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2021లో నవంబర్ 15ను జనజాతీయ గౌరవ దివస్‌గా ప్రకటించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో గిరిజన వీరుల పాత్రను, భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక, సామాజిక జీవితంలో గిరిజన సమాజాల ప్రాధాన్యాన్ని ఈ రోజు గుర్తుచేస్తుంది. రాంచీ (2021), ఖుంటి (2022, 2023), జముయి (2024), దేడియాపాడా (2025)లో గత ఐదేళ్లుగా వేడుకలు నిర్వహించారు. ూవీ-జీూచీపీూచీ, ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ వంటి కార్యక్రమాలకు కూడా ఈ దినోత్సవం ఊతమిచ్చింది.

భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని 2024--25లో జనజాతీయ గౌరవ సంవత్సరంగా నిర్వహించారు. ఆ ఏడాది 28కు పైగా జాతీయస్థాయి కార్యక్రమాలు, రెండు లక్షలకు పైగా కార్యకలాపాలు చేపట్టగా, 3.8 కోట్ల మందికి పైగా పాల్గొన్నారు. గిరిజన సమాజాల స్వాతంత్ర్య పోరాట పాత్రతో పాటు వారి జ్ఞానం, కళలు, ప్రకృతితో సామరస్య జీవన విధానాన్ని గుర్తించడం ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని మంత్రిత్వ శాఖ తెలిపింది.

**పక్షోత్సవాల్లో ప్రధాన కార్యక్రమాలు:**

- నవంబర్ 12న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల (జువీూా)కు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతితో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు.
- నవంబర్ 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో జాతీయ గిరిజన సాహిత్య ఉత్సవం నిర్వహిస్తారు. దేశవ్యాప్తంగా గిరిజన రచయితలు హాజరవుతారు.
- 'ఆది వాణి'ని గిరిజనుల జీవంత వారసత్వంగా, జాతీయ గిరిజన భాషా నిధిగా బలోపేతం చేయడంపై ఐఐటీ ఢిల్లీలో జాతీయ వర్క్‌షాప్ నిర్వహిస్తారు.
- నవంబర్ 14న రాణి దుర్గావతి ఆదివాసీ మహిళా సమ్మేళనం జరుగుతుంది. 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 500 మంది గిరిజన మహిళా వ్యాపారవేత్తలు పాల్గొని మార్కెట్ అనుసంధానాలు, మహిళల నేతృత్వంలోని వ్యాపారాల అభివృద్ధిపై చర్చిస్తారు.
- అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 వరకు ూవీ-జీూచీపీూచీ బహుళ ప్రయోజన కేంద్రాల్లో అత్యంత వెనుకబడిన గిరిజన సమూహాల (ూఒ+ం) కోసం ఆరోగ్య, పోషణ, ప్రభుత్వ పథకాల శిబిరాలు నిర్వహిస్తారు.
- హైదరాబాద్‌లో నవంబర్ 1, 2 తేదీల్లో తొమ్మిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి సుమారు 1,500 మంది సంప్రదాయ వైద్యులకు శిక్షణ ఇస్తారు. లక్ష మంది వైద్యులకు శిక్షణ, ధ్రువీకరణ అందించే కార్యక్రమంలో ఇది భాగం.
- ఆది సేవా సమయం, ఆది సేవా దినం ద్వారా ధర్తీ ఆబా జనభాగీదారీ అభియాన్ కింద గిరిజన గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తారు. 76,963 గ్రామాల్లో పనిచేసే సుమారు 1.54 లక్షల ఆది కర్మయోగి వాలంటీర్లకు రాష్ట్ర పరిపాలనా శిక్షణ సంస్థల ద్వారా శిక్షణ అందిస్తున్నారు.
- 73 జిల్లాల్లో విద్యార్థుల కోసం స్కాలర్‌షిప్ సహాయ శిబిరాలు నిర్వహించి, దరఖాస్తులు, ఆధార్ అనుసంధానంలో సహాయం చేస్తారు.
- ఒడిశాలోని కోరాపుట్‌లో CSIR-NBRI సహకారంతో 200 నుంచి 300 ఔషధ మొక్కల జాతుల సంరక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

జనజాతీయ గౌరవ దివస్ సందర్భంగా వివిధ రాష్ట్రాల్లో గిరిజన సమాజాల కోసం 300కు పైగా ప్రాజెక్టులు చేపట్టనున్నారు. వీటిలో 228 ప్రాజెక్టులను ప్రారంభించేందుకు, 74 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసేందుకు సిద్ధం చేశారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఇటానగర్‌లో కొత్త గిరిజన పరిశోధనా సంస్థ భవనం, మిజోరంలోని కెల్సిహ్‌లో రోపుయిలియాని గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం వీటిలో ఉన్నాయి.

రెండు జాతీయ డిజిటల్ కార్యక్రమాలను కూడా ప్రారంభించనున్నారు. ICMR సహకారంతో రూపొందించిన 'జన్-హిట్' (జనజాతీయ ఆరోగ్య సమాచారం, సాంకేతికత) పోర్టల్ గిరిజన తెగల వారీగా ఆరోగ్య సమాచారాన్ని అందించే దేశంలోనే తొలి వేదికగా నిలవనుంది. ఇందులో 20 రాష్ట్రాల వివరాలు ఉంటాయి. అటవీ హక్కుల చట్టం--2006 కింద గ్రామసభలో దరఖాస్తు సమర్పణ నుంచి డిజిటల్ సంతకాలతో హక్కు పత్రాల జారీ వరకు మొత్తం ప్రక్రియను ఒకే వ్యవస్థలోకి తీసుకురావడానికి జాతీయ అటవీ హక్కుల డిజిటల్ వేదికను ప్రారంభిస్తారు.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని గిరిజన పరిశోధనా సంస్థలు 19 ప్రాంతాల్లో 160కి పైగా కార్యక్రమాలను రూపొందించాయి. వీటికి లక్ష మందికి పైగా హాజరవుతారని అంచనా. సాంస్కృతిక ఉత్సవాలు, ప్రదర్శనలు, నివాళి కార్యక్రమాలు, పాఠశాలలు, ఏకలవ్య పాఠశాలలు, హాస్టళ్లలో పోటీలు, సంక్షేమం, జీవనోపాధి శిబిరాలు నిర్వహిస్తారు.

ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రస్థాయి గిరిజన కార్నివాల్, గోవాలో ఆదివాసీ కళా, క్రీడా సమ్మేళనం, ఒడిశాలో భగవాన్ బిర్సా ముండా ప్రత్యేక ప్రదర్శనశాల, షిల్లాంగ్‌లో గిరిజన సంగీత ఉత్సవం, గుజరాత్‌లోని అహ్మదాబాద్ హాట్‌లో గిరిజన కళలు, హస్తకళల ప్రదర్శన ప్రధాన ఆకర్షణలుగా ఉండనున్నాయి. ఆధార్, స్కాలర్‌షిప్ శిబిరాలతో పాటు, సికిల్ సెల్ పరీక్షలు,ూఒ+ం కోసం ఆయుష్మాన్ కార్డు శిబిరాలు, అటవీ హక్కులపై న్యాయ అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు.

## ఇన్వెస్ట్ తెలంగాణ--గ్లోబల్ సమ్మిట్--2026కు 550కి పైగా దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలకు ఆహ్వానాలు

**న్యూఢిల్లీలో అక్టోబర్ 29న గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమం**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**

భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణా--గ్లోబల్ సమ్మిట్--2026లో పాల్గొనాల్సిందిగా 550కి పైగా దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు సంబంధించి వివిధ కమిటీల ద్వారా చేపడుతున్న ఏర్పాట్ల పురోగతిపై మంగళవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్ అధికారులు నవీన్ మిట్టల్, హరిచందన, గౌరవ్ ఉప్పల్, సర్ఫరాజ్ అహ్మద్, కృష్ణ ఆదిత్య, అనుదీప్, శశాంక, కృష్ణ భాస్కర్, వల్లూరి క్రాంతి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడం, భారీ పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త అవకాశాలను సృష్టించడం, యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇన్వెస్ట్ తెలంగాణ --గ్లోబల్ సమ్మిట్--2026ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని తెలిపారు.

ఈ సమ్మిట్‌కు విస్తృత అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో భాగంగా అక్టోబర్ 29న న్యూఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఈ కార్యక్రమంలో గౌరవ ముఖ్యమంత్రి. ఎ. రేవంత్ రెడ్డి పాల్గొంటారని, వివిధ దేశాల రాయబారులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, దిగ్గజ కంపెనీల అధిపతులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులతో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి, తెలంగాణలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి ఈ కార్యక్రమం కీలక వేదికగా నిలవనుందని పేర్కొన్నారు. ఇప్పటికే చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026పై రోడ్‌షోలను నిర్వహించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో జరగనున్న ప్రధాన సమ్మిట్‌కు 1,500కు పైగా కంపెనీలు, సంస్థల ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు.

రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం

గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా నిర్వహించనున్న రక్షా ఎక్స్ పోలో పాల్గొనేందుకు ప్రపంచవ్యాప్తంగా ఏరోస్పేస్, రక్షణ రంగాలకు చెందిన సుమారు 100 కంపెనీలు, సంస్థలను ఆహ్వానిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఆయా సంస్థలకు ఇప్పటికే ప్రత్యేక ఆహ్వానాలు పంపామని, ఆహ్వాన ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. ఈ ఎక్స్ పో లో తెలంగాణలోని ఏరోస్పేస్, రక్షణ రంగాల ప్రతినిధులు పాల్గొంటారు.

సమ్మిట్ నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు

ఫ్యూచర్ సిటీలో సమ్మిట్ జరిగే ప్రధాన వేదికను 25 సెక్టార్లుగా విభజించి, ప్లీనరీ సమావేశాలు, సెమినార్లు, చర్చలు, ఒప్పందాల కార్యక్రమాలు, ఎగ్జిబిషన్లు, వివిధ కంపెనీలు సంస్థల ప్రదర్శనలకు అవసరమైన వసతులను ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, కళా వైభవాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమ్మిట్‌కు హాజరయ్యే దేశీయ, అంతర్జాతీయ ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా, వసతి, సమావేశాల నిర్వహణతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ప్రతినిధికి సమన్వయ బాధ్యతలు నిర్వహించేందుకు ఒక సీనియర్ అధికారిని నోడల్ అధికారిగా నియమించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇన్వెస్ట్ తెలంగాణా--గ్లోబల్ సమ్మిట్--2026ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ప్రధాన కార్యదర్శి

## పనితీరులో మార్పు రాకపోతే కఠినచర్యలు తప్పవు

## భూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని సహించేది లేదు

**-భూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి**
**-క్షేత్రస్థాయిలో సర్వేను పరిశీలించి రైతులకు భూమి విస్తీర్ణంపై స్పష్టత ఇవ్వాలి**
**-రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించబోం**
**-పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి**
**-పేదల సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం**
**-రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**

రెవెన్యూ ఉద్యోగులు సక్రమంగా, బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడే ప్రజల ముఖ్యంగా రైతుల సమస్యలు తీరుతాయని ఈ విషయంలో ఇప్పటికే పలుమార్లు రెవెన్యూ ఉద్యోగులను ఆదేశించినప్పటికీ పూర్తిస్థాయి ఫలితాలు కనిపించలేదని భవిష్యత్తులో మార్పురాకపోతే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హెచ్చరించారు. మంగళవారం నాడు ఉమ్మడి మెదక్ జిల్లాలోని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖల పనితీరుపై సంగారెడ్డి కలెక్టరేట్‌లో మంత్రి పొంగులేటి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం రీ సర్వే చేపట్టింది

భూ సర్వే నిర్వహణకు సంబంధించి పలువురు తహసీల్దార్లు, సర్వేయర్లతో ముఖాముఖి నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే కోసం ఎన్ని గ్రామాలను కేటాయించారు, ఇప్పటివరకు ఎన్ని గ్రామాల్లో సర్వే పూర్తయింది, ఏ విధంగా సర్వే నిర్వహిస్తున్నారు, రోజుకు ఎన్ని ఎకరాల భూమిని సర్వే




చేస్తున్నారు, సర్వే పూర్తి చేయడానికి ఎంత సమయం పడుతోంది తదితర అంశాలపై ఆరా తీశారు.

సర్వే సమయంలో సంబంధిత రైతుకు తన భూమి ఎంత విస్తీర్ణంలో ఉందో స్పష్టంగా తెలియజేయాలని తహసీల్దార్లు, సర్వేయర్లకు సూచించారు. భూమి విస్తీర్ణం, సరిహద్దులకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, రైతులకు ఎలాంటి సందేహాలు లేకుండా వివరించాలని పేర్కొన్నారు.

తహసీల్దార్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు రెవెన్యూ అధికారులు సర్వే ప్రక్రియను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పనుల పురోగతిని స్వయంగా పరిశీలిస్తూ, రైతుల సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకోవాలని ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా, రైతులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఏడాదిన్నరలోపు వ్యవసాయ భూములతో పాటు ఆబాదీ ఆస్తుల రీ సర్వేను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందని, రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని సూచించారు.

రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారమయ్యే వరకు విడతలవారీగా ఇళ్ల మంజూరు కొనసాగుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులపై నిర్మాణ వ్యయ భారాన్ని తగ్గించేందుకు సిమెంట్ బ్యాగ్‌ను కేవలం రూ.230కే అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం**

అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రిగారు ఆదేశించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు వేగవంతంగా, పూర్తి పారదర్శకంగా, అర్హత ప్రాతిపదికన జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమీక్షకు ముందు పలువురు ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో నెలకొన్న భూ సమస్యలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులకు సంబంధించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు సంబంధిత జిల్లా కలెక్టర్లకు మంత్రి పలు సూచనలు చేశారు. ప్రజాప్రతినిధులు అందించిన సలహాలు, సూచనలను స్వీకరించారు.

ఈ సమావేశంలో ఎంపీ రఘునందన్ రావు, సురేశ్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, సంజీవరెడ్డి ,సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు ప్రతీక్ జైన్, హైమావతి, ప్రతిమా సింగ్‌లతో పాటు అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ ఎల్డర్స్ డే వేడుకలు - ఆకట్టుకున్న... హాస్యవదాన కార్యక్రమం



**ట్రైనెట్ న్యూస్, హైదరాబాద్ అక్టోబర్ 27 :**
మహీంద్రా అశ్వితలైఫ్ స్పేస్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎల్డర్స్ డే వేడుకలు ఘనంగా ని ర్వహించారు. ముందుగా ఇష్మా న్ భటేష్ శ్రీరామ భజ జయతి జయగానం చేశారు. కేరళంపై కుంజాన్ పిల్లాయ్, ఇండోర్ సాం ప్రదాయ వంటల రాజధాని అని అజయ్ మొగీ అసోసియేషన్ ప్రె సిడెంట్ అంతర్జాతీయ వృద్ధులు దినోత్సవ చరిత్ర అంశాలపై ప్రసం గం జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరవ అధితిగా డా.రాజేంద్ర గొట్టి పాటి ప్రెసి డెంట్ భారత్ వికాస్ పరిషత్ (జనరక్ మెడిసిన్స్) అశ్విని సుబ్బారావు మహీంద్రా అశ్విత హాజరై మాట్లాడారు. వయోవృద్ధులు అందరికీ మార్గ దర్శకులు అని, వారి అనుభవం, జ్ఞానం యువత కు స్ఫూర్తిదాయ కం అని అన్నారు. ఈ సందర్భం గా అసోసియేషన్ ఆగస్ట్ 15 స్వతం త్ర దినోత్సవం సందర్భం గా నిర్వహించిన స్పోర్ట్స్ లో పోటీలో గెలిచిన విన్నర్స్ వాకింగ్ లో వై.రామారావు, ఎంఎన్ మూ ర్తి, అను రాధ, జి.వి.లక్ష్మి, సూప ర్ సీనియర్ లను సన్మానించారు. అనంత రం ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ హైదరా బాద్ వారిచే నవ్వుకుం దాం రండి (అవధాన రూపకం) పేరడీ అవ ధానం శ్రీజయంతి నరసింహం (అవధాని) బృందం అప్రస్తుతం కె ఎల్ కామేశ్వరరా వు, సమన్వయ కర్త ఎంవి సుబ్ర హ్మణ్యం, పృచ్ఛ కులు ఆర్ వి రమణ, జివిలక్ష్మి, బాలసరస్వ తి, రాజేశ్వరి అను రాధ పాల్గొని ప్రేక్షకులను నవ్వు లతో ముంచా రు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎన్ పాపారావు, సెక్రటరి పి శ్రీకృ ష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వార్తకు వన్నె తెచ్చేది గళ మాధుర్యమే న్యూస్ ప్రెజెంటర్లు గళ కళాకారులు.. కోలేటి దామోదర్ గుప్తా



**రవీంద్ర భారతి, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 27:**
వార్తలోని భావాన్ని ప్రేక్షకుల హృదయాలకు చేరవేయాలంటే కేవలం పదాలు చదివితే సరిపోదు.. గళంలో మాధుర్యం, మాటల్లో స్పష్టత, సందర్భానికి తగిన హెచ్చు తగ్గులు ఉండాలని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా అన్నారు. వార్తా కథనానికి స్వరమే ప్రత్యేక ఆకర్షణను తీసుకొస్తుందని, న్యూస్ ప్రెజెంటర్లు ఈ అంశంపై దృష్టి సారించాలని సూచించారు.ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు పేరిట మీడియా రంగ ప్రముఖులకు జీవన సాఫల్య, ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం మంగళవారం రాత్రి రవీంద్ర భారతిలోని ప్రధాన వేదికపై వైభవంగా జరిగింది. భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శృతిలయ ఫౌండేషన్, సీల్ వెల్ కార్పొరేషన్ సంయుక్త నిర్వహణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోలేటి దామోదర్ గుప్తా మాట్లాడుతూ, ప్రజలకు సమాచారాన్ని అందించడంలో మీడియా పాత్ర కీలకమని పేర్కొన్నారు. అయితే రాజకీయ పార్టీల ప్రభావంతో నడిచే పత్రికల్లో ఒకే అంశానికి సంబంధించిన వార్తలు భిన్నంగా ప్రచురితమవుతున్నాయని అభిప్రాయపడ్డారు. వార్తను అందించే విధానంలో బాధ్యత, స్పష్టత, నిబద్ధత అవసరమని పరోక్షంగా సూచించారు.

**తెరపై కనిపించేది వార్త.. వినిపించేది గళ కళ!**

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సమాచార హక్కు చట్టం మాజీ ముఖ్య కమిషనర్ పి. విజయబాబు మాట్లాడుతూ, న్యూస్ ప్రెజెంటర్లు కేవలం వార్తలు చదివే వారు మాత్రమే కాదని, తమ గళంతో ప్రేక్షకులను ఆకట్టుకునే కళాకారులని అభివర్ణించారు. అందుకే వారిని 'గళ కళాకారులు'గా గుర్తించాలని పేర్కొన్నారు. సినిమా, రంగస్థల కళాకారులకు లభిస్తున్నట్లుగానే టెలివిజన్ న్యూస్ ప్రెజెంటర్లకూ ప్రభుత్వాలు అవార్డులు అందించి ప్రోత్సహించాలని కోరారు. టీజీవో నాయకుడు ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, శృతిలయ ఫౌండేషన్‌కు చెందిన ఆమని గాయనిగా ప్రతిభ చాటడంతో పాటు, ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నారని గుర్తుచేశారు.

**మీడియా సేవలకు పురస్కారాల గుర్తింపు**

మీడియా రంగంలో విశేష సేవలందించిన ప్రముఖులను ఈ సందర్భంగా పురస్కారాలతో సత్కరించారు. నమస్తే తెలంగాణకు చెందిన రఘు రాములు, మహా న్యూస్‌కు చెందిన కృష్ణమూర్తి, ఆంధ్రప్రభకు చెందిన డాక్టర్ మారం శ్రీనివాస్‌లకు జీవన సాఫల్య పురస్కారాలను ప్రదానం చేశారు. వివిధ టీవీ చానెళ్లు, పత్రికలకు చెందిన విజయ చంద్రిక, ప్రభాకర్, అరుణ్ కుమార్, జితేందర్, మంజుల, అక్షయ, సంధ్య, ప్రియాంక, ధనలక్ష్మి, బ్రాహ్మణిలకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. మైనార్టీ మోర్చా నాయకుడు షేక్ షాజహాన్‌ను అక్కినేని స్ఫూర్తి పురస్కారంతో సత్కరించారు.

**పాటలతో ఆరంభం.. ప్రశంసలతో ముగింపు**

కార్యక్రమ ప్రారంభంలో ఆమని, సుభాష్, కృష్ణ తదితరులు ఆలపించిన పాటలు సభికులను అలరించాయి. అనంతరం పురస్కార ప్రదానం, ప్రముఖుల ప్రసంగాలతో కార్యక్రమం సందడిగా సాగింది. ఈ కార్యక్రమంలో కుసుమ, భోగరాజు, నరహరి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన కళలకు కొత్త మార్కెట్.. కళాకారులకు అండగా ఆది బజార్!

**రాయ్‌పూర్, అక్టోబర్ 27:**
గిరిజన కళాకారుల చేతివృత్తులకు విస్తృత మార్కెట్ కల్పించే లక్ష్యంతో ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఆది బజార్--2026 నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 24 నుంచి నవంబర్ 2 వరకు జరిగే ఈ ప్రదర్శనలో వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. వెదురు, చెక్కతో తయారుచేసిన వస్తువులు, గిరిజన ఆభరణాలు, సంప్రదాయ చిత్రకళలు, చేనేత వస్త్రాలు, సహజ అటవీ ఉత్పత్తులు ఈ ప్రదర్శనలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. కళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించే అవకాశం పొందుతున్నారు. మధ్యవర్తులపై ఆధారపడే పరిస్థితిని తగ్గించి, స్థానిక కళాకారుల ఆదాయాన్ని పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.



భారతీయ గిరిజన సంప్రదాయాలు కేవలం కళాత్మక విలువలకే పరిమితం కావు. అవి తరతరాలుగా వస్తున్న నైపుణ్యానికి, జీవన విధానానికి ప్రతీకలు. ఇటువంటి ప్రదర్శనలు సంప్రదాయ వృత్తులకు కొత్త తరం నుంచి ఆదరణ పెంచడంలోనూ, స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించడంలోనూ తోడ్పడతాయి.

## గిరిజన నృత్యాలు.. భారతీయ సంస్కృతికి జీవంతమైన ప్రతిబింబం

**ముంబై, అక్టోబర్ 27:**
భారతీయ గిరిజన సమాజాల నృత్యాలు, సంగీతం, జానపద కళలు దేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. నవీ ముంబైలో నిర్వహించిన ఆది మహోత్సవ్--2026 ప్రారంభ కార్యక్రమంలో పాల్ఘర్ ప్రాంతానికి చెందిన కళాకారులు ప్రదర్శించిన తార్పా నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. గిరిజన నృత్యాలు వినోదానికి మాత్రమే పరిమితం కావు. అవి సమాజ జీవన విధానం, ప్రకృతితో అనుబంధం, పండుగలు, సామూహికఐక్యతవంటిఅంశాలనుతెలియజేస్తాయి. సంప్రదాయవాయిద్యాలు, ప్రత్యేక దుస్తులు, సమూహంగా చేసే నృత్య కదలికలు ఒక్కో ప్రాంతానికి ప్రత్యేకమైన గుర్తింపును అందిస్తాయి.ఆధునిక జీవనశైలి, పట్టణీకరణ కారణంగా కొన్ని సంప్రదాయ కళారూపాలకు యువతలో పరిచయం తగ్గే అవకాశం ఉంది. అందువల్ల పాఠశాలలు, కళాశాలలు, సాంస్కృతిక



సంస్థలు జానపద కళాకారులతో కార్యక్రమాలు నిర్వహించడం అవసరం. యువ కళాకారులకు శిక్షణ, ప్రదర్శన వేదికలు, తగిన పారితోషికం అందించడం కూడా ముఖ్యమే.స్థానిక పండుగలు, జాతీయ సాంస్కృతిక ఉత్సవాల్లో గిరిజన నృత్యాలకు స్థానం కల్పిస్తే కళాకారులకు గుర్తింపు లభిస్తుంది. వారి సంప్రదాయాలను గౌరవిస్తూ, వాటి అసలు ప్రత్యేకతను కాపాడుతూ ప్రజలకు పరిచయం చేయడం భారతీయ వారసత్వ పరిరక్షణలో





కీలకమైన అడుగు.

## చేనేత కళకు కొత్త ఊపు.. సంప్రదాయ వస్త్రాలకు పెరుగుతున్న ఆదరణ!



**గువాహటి, అక్టోబర్ 27:**
భారతదేశంలోని విభిన్న చేనేత సంప్రదాయాలను ప్రజలకు చేరువ చేసేందుకు నిర్వహిస్తున్న శిల్ప సంగమ మేళా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అక్టోబర్ 21న ప్రారంభమైన ఈ ప్రదర్శన అక్టోబర్ 28 వరకు కొనసాగుతోంది. ఇందులో 75 మంది కళాకారులు పాల్గొంటుండగా, వారిలో 31 మంది మహిళలు ఉన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత వస్త్రాలు, చేతితో తయారుచేసిన అలంకరణ వస్తువులు, సంప్రదాయ హస్తకళలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. కళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించడంతో పాటు కొత్త వినియోగదారులతో పరిచయాలు పెంచుకునే అవకాశం పొందుతున్నారు.

యంత్రాలతో తయారయ్యే వస్తువులకు భిన్నంగా, చేతివృత్తుల ద్వారా రూపొందించే ఉత్పత్తుల్లో స్థానిక సంప్రదాయాలు, కళాకారుల నైపుణ్యం ప్రతిబింబిస్తాయి. చేనేత వస్త్రాలను కొనుగోలు చేయడం ద్వారా కళాకారుల జీవనోపాధికి మద్దతు లభించడమే కాకుండా, వారసత్వ వృత్తుల కొనసాగింపునకు కూడా సహాయం అందుతుంది.

## సంప్రదాయ చిత్రకళలకు కొత్త తరం అండ.. డిజిటల్ వేదికలతో విస్తృత ప్రచారం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 27**
గోండ్, వార్లీ, మధుబని వంటి భారతీయ సంప్రదాయ చిత్రకళలు తమ ప్రత్యేక ఆకృతులు, రంగులు, కథన శైలులతో దేశ కళా వారసత్వంలో విశిష్ట స్థానం సంపాదించాయి. ఈ కళారూపాలను కొత్త తరానికి పరిచయం చేయడం, కళాకారులకు విస్తృత అవకాశాలు కల్పించడం ప్రస్తుతం సాంస్కృతిక రంగంలో ముఖ్యమైన అంశంగా మారుతోంది.గోండ్‌చిత్రకళలో ప్రకృతి, జంతువులు, చెట్లు, స్థానిక కథలకు ప్రాధాన్యం కనిపిస్తుంది. వార్లీ కళలో సరళమైన రేఖలు, రేఖాగణిత ఆకృతులతో గ్రామీణ జీవితం, సామూహిక కార్యక్రమాలు చిత్రీకరిస్తారు. మధుబని చిత్రకళలో ప్రత్యేక నమూనాలు, రంగుల వినియోగం, సంప్రదాయ కథనాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి.ఈ చిత్రకళలను కాన్వాస్ చిత్రాలు,



గృహాలంకరణ వస్తువులు, వస్త్ర రూపకల్పన, పుస్తకాల ముఖచిత్రాలు వంటి విభిన్న రూపాల్లో ఉపయోగించవచ్చు. డిజిటల్ వేదికల ద్వారా కళాకారులు తమ పనిని ఎక్కువ మందికి పరిచయం చేసుకునే అవకాశం కూడా ఉంది. అయితే సంప్రదాయ కళారూపాలను ఉపయోగించే సమయంలో అసలు కళాకారులకు గుర్తింపు ఇవ్వడం, వారి హక్కులను గౌరవించడం అవసరం.



కళా శిబిరాలు, శిక్షణా కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా యువతలో చిత్రకళపై ఆసక్తిని పెంచవచ్చు. సంప్రదాయ కళలను ఆధునిక అవసరాలకు అనుగుణంగా పరిచయం చేస్తూనే వాటి చారిత్రక నేపథ్యం, స్థానిక ప్రత్యేకతను కాపాడటం అత్యంత ముఖ్యం.

## భారతీయ హస్తకళలకు ప్రపంచ మార్కెట్.. ఎగుమతులపై వ్యాపార వర్గాల దృష్టి

**గ్రేటర్ నోయిడా, అక్టోబర్ 28:**
భారతీయ హస్తకళలు, గృహాలంకరణ ఉత్పత్తులు, సంప్రదాయవస్తువులనుఅంతర్జాతీయకొనుగోలుదారులకు పరిచయం చేసేందుకు నిర్వహించిన 62వ ఐహెచ్‌జీఎఫ్ ఢిల్లీ ఫెయిర్--ఆటమ్ 2026 అక్టోబర్13 నుంచి 17 వరకు జరిగింది. భారతీయ హస్తకళల ఎగుమతులను ప్రోత్సహించే ఈ కార్యక్రమంలో వివిధ ఉత్పత్తుల తయారీదారులు, వ్యాపారులు, అంతర్జాతీయ కొనుగోలుదారులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో చేతితో తయారుచేసిన గృహాలంకరణ వస్తువులు, ఫర్నిచర్, వస్త్రాలు, లైటింగ్ ఉత్పత్తులు, బహుమతులు, ఫ్యాషన్ ఉపకరణాలు, పర్యావరణహిత ఉత్పత్తులను



ప్రదర్శించారు. సంప్రదాయ భారతీయ నైపుణ్యాన్ని ఆధునిక రూపకల్పనతో కలిపి రూపొందించిన వస్తువులు ఈ రంగంలో వ్యాపార అవకాశాలను విస్తరించేందుకు దోహదపడుతున్నాయి. భారతదేశంలోని చిన్నతరహా తయారీదారులు,



కళాకారులకు విదేశీ మార్కెట్లను చేరుకోవడం ఎప్పుడూ సులభం కాదు. నాణ్యత ప్రమాణాలు, రవాణా ఖర్చులు, ప్యాకేజింగ్, సరఫరా సమయం వంటి అంశాలు కీలకంగా ఉంటాయి. అంతర్జాతీయ ప్రదర్శనల్లో పాల్గొనడం ద్వారా కొత్త కొనుగోలుదారులతోపరిచయాలు ఏర్పరచుకోవచ్చు.










Edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA.
www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136